గోతెలుగు.కామ్

చక్కటి కుటుంబ వార పత్రిక

# సెప్టెంబర్ 2014

# కథలు




న్యూయార్క్ నగరంలో ఓ ఆకాశహర్మ్యంలో... ముప్పై ఎనిమిదో అంతస్థులోని ఒక ఫ్లాట్ కాలింగ్ బెల్ మ్రోగింది. క్లోజ్డ్ సర్క్యూట్ టీవీల్ లో కనిపిస్తున్న ఆమె భర్తను చూడగానే విషణ్ణవదనంతో ఒంటరిగా లోపల కూర్చున్న మహతికి ప్రాణం లేచి వచ్చినట్టయింది. ఉత్సాహంగా వెళ్ళి తలుపు తీసింది.

"వచ్చావా శశీ... గంట సేపటినుండి నీ కోసం చూస్తున్నా!" చిరునవ్వుతో దర్శనమిచ్చిన ఆమె ముఖం మరుక్షణంలోనే వాడిపోవడంతో గాభారాగా చూసాడు శశాంక్.

"ఏమైంది మహతీ, ఎందుకంత విచారంగా ఉన్నావ్? ఎందుకంత పరుగు పెట్టి రావడం? చూడు ఎలా ఆయాస పడుతున్నావో! వట్టి మనిషివి కూడా కాదు కదా నువ్వు, నిదానంగా వచ్చి తలుపు తీయొచ్చు కదా?!" అనునయంగా చెప్పాడు శశాంక్.

"సర్లేకానీ ముందు నన్నీ విషయం చెప్పనీ శశీ! మధ్యాహ్నం నుండీ నీకు చెప్దామంటే మీ ఆఫీసులో ఫోన్ మాట్లాడనివ్వరు..."

"సరే, అంత అర్జెంటుగా చెప్పాల్సిన విషయమేంటో చెప్పేసెయ్ ముందు?"

"మధ్యాహ్నం మా అమ్మ ఫోన్ చేసింది శశీ..." అలా చెప్తూండగానే గుండ్రని మహతి కన్నుల్లో గిర్రు గిర్రుమంటూ నీళ్ళు తిరిగిపోయాయి.

"ఏమయిందిరా? ముందు ఏడుపాపు!" వరద గోదారిలా పొంగుతున్న కన్నీటిని తుడుస్తూ ఆమెను ఓదార్చే ప్రయత్నం చేస్తూ పొదివి పట్టుకున్నాడు శశాంక్.

"అమ్మకు రావడం కుదరదట! ఇప్పుడు కుదరదంటే అసలేమైనా అర్థముందంటావా?" రుద్ధకంఠంతో ఆక్రోశించింది మహతి.

"తనకు వీలు కాలేదేమోలే."

"వీలు కాదా?! ఎలాగోలా వీలు చేసుకోకపోతే ఎలా చెప్పు? కూతురు కానుపుకు కూడా సాయపడకపోతే 'అమ్మ ' పదానికి అర్థం ఉందంటావా ?" ఆవేశంగా అడిగింది మహతి.

"అసలు నీకు నేను ముందే చెప్పాను. ఇక్కడ అన్ని అధునాతన సౌకర్యాలూ ఉన్నాయి. ప్రత్యేకంగా ఇండియానుండి మన కోసం శ్రమ పడి ఎవరూ రావక్కరలేదని. వాళ్ళకు కూడా ఈ వయసులో ఇంత కష్టపడి అంత దూరాన్నుండి రావాలంటే కష్టమే కదా మహతీ?" సర్దిచెప్పే ప్రయత్నం చేసాడు శశాంక్.

"కూతురు ఏడోనెల కడుపులో ఉందని, ఆ కడుపులో ఇద్దరు కవలలు పెరుగుతున్నారని తెలిసి కూడా రాలేనని చెప్పిన తల్లిని నువ్వేం సమర్థించనవసరం లేదు!" పౌరుషంగా చెప్పింది మహతి.

"బాధపడకు మహతీ, నేను ఫోన్ చేసి విషయం కనుక్కుంటానులే!"

"ఏమీ అక్కరలేదు. నువ్వు చెప్పినట్టుగా ఇక్కడ మనకన్ని ఫెసిలిటీస్ ఉన్నాయి. మనమే మన తంటాలు పడదాం. అంతగా అవసరమైతే ఇక్కడ మన స్నేహితుల సాయం తీసుకుందాం. అంత దూరాన్నుండి వచ్చి ఎవరూ మనల్ని ఉద్ధరించాల్సిన పని లేదు!" రోషంగా చెప్పింది మహతి.

"సరే, అవన్నీ తర్వాత ఆలోచిద్దాం కానీ ముందు నువ్వు కాసేపు పడుకో." మహతి చెయ్యి పట్టుకుని లోపలికి తీసుకెళ్ళాడు శశాంక్. మౌనంగా అతనితో పాటు నడిచింది మహతి.

రెండురోజుల తర్వాత ఓ రాత్రి భోజనం చేస్తూండగా భార్యతో చెప్పాడు శశాంక్, " వచ్చే ఆదివారం మా అమ్మ ఇక్కడికి వస్తోంది."

నోట్లో పెట్టుకోబోతున్న ముద్దను చేత్తో పట్టుకుని అలానే ఉండిపోయింది మహతి. కొద్ది క్షణాల తర్వాత చెప్పింది- "నిజమా శశాంక్?! కానీ నువ్ ఫోన్ చేసి ఆవిడను పిలిచినట్టున్నావ్ కదూ? ఎందుకు శశాంక్, ఆవిడకు మాత్రం శ్రమ కాదా? అయినా ఇంకెవర్నీ ఇండియానుండి ఇక్కడకు పిలవొద్దనీ, మన బాధలేవో మనమే పడదామని మొన్నేగా అనుకున్నాం?"

"అనుకున్నాం కానీ ఈ దేశం కాని దేశంలో నీకు ఇలాంటి పరిస్థితిలో ఓ పెద్ద దిక్కు సాయంగా ఉంటేనే మంచిదని నాకు అనిపించింది. అమ్మను రమ్మని నేనే ఫోన్ చేసి చెప్దామనుకున్నాను కానీ ఈలోగా నాన్నే అమ్మను పంపిస్తున్నట్టుగా ఫోన్ చేసి చెప్పారు. కాగల కార్యాన్ని గంధర్వులే నెరవేర్చినట్టుగా అలా మన పని తేలికయింది." సంతోషంగా చెప్పాడు శశాంక్.

"ఏమో శశాంక్! అంత దూరం నుండి అత్తయ్యను రప్పించడం, ఆవిడ చేత పనులు చేయించుకోవడం ఊహించుకోవడానికే నాకు ఇబ్బందిగా ఉంది." బెదురు చూపులతో చెప్పింది మహతి.

"మనం పూర్తిగా అమ్మ పైనే అన్నిటికీ ఆధారపడిపోము కదా. నేనూ సాయముంటానులే. కంగారు పడిపోకు మహతీ." ధైర్యం చెప్పాడు శశాంక్.

ఆదివారం రానే వచ్చింది. శశాంక్ ఎయిర్ పోర్టుకు వెళ్ళి తల్లి కౌసల్యను తీసుకువచ్చాడు.

"నమస్తే అత్తయ్యా! బావున్నారా?" రెండు చేతులూ జోడించింది మహతి.

"నమస్తే మహతీ, ఎలా ఉన్నావురా?! అక్కడికి రమ్మంటే వచ్చావు కాదు. డాక్టర్ చెప్పినట్టుగా మందులన్నీ వేసుకుంటున్నావ్ కదా?! అయినా ఇక భయం లేదులే, నేను దగ్గరుండి నీ చేత మింగిస్తాను కదా!" అని చెప్పి నవ్వింది కౌసల్య.

"కొంచెం కాఫీ తాగి స్నానం చేద్దురుగాని అత్తయ్యా, కూర్చోండి." అని చెప్పి వంటగది వైపు నడవబోయింది మహతి.

ఆమె దారికి అడ్డంగా వెళ్ళి వెనక్కి తీసుకువచ్చి సోఫాలో కూర్చోబెడుతూ చెప్పింది కౌసల్య, "కాఫీ నేను కలుపుకోగలను. నువ్వు నాకు సేవలేమీ చెయ్యనక్కరలేదు. సాయపడాల్సింది నేను! నేను వచ్చిన పని కూడా అదే."

బదులేమీ చెప్పకుండా అత్తగారి వైపు కృతజ్ఞతగా చూసింది మహతి.


"ఇదేం పెద్ద కష్టం కాదు కానీ తీసుకోండి!" అంటూ ట్రేలో మూడు కాఫీ కప్పులతో శశాంక్ రావడంతో ముగ్గురూ హాయిగా నవ్వుకున్నారు.మరో రెండు నెలల కాలం చకచకా గడిచిపోయింది. అత్తగారు రావడంతో, భర్త చేదోడువాదోడుగా ఉండడంతో చక్కని విశ్రాంతి దొరికిన మహతికి ఒకరోజు చూడముచ్చటగా ఉన్న బాబు, పాప పుట్టారు.

పొత్తిళ్ళలోని పిల్లలిద్దరినీ చూసి ఎంతగానో మురిసిపోయింది కౌసల్య. "ఒకేసారి కవలల్ని కనేసి ఒక పనయిపోయింది అనిపించావ్ మహతీ! ఎంత ముద్దుగా ఉన్నారో నా మనవడూ, మనవరాలూ!" మహతి జుత్తును ప్రేమగా సవరిస్తూ సంతోషంగా చెప్పింది కౌసల్య.పిల్లలిద్దరినీ దగ్గరగా వాళ్ళ ముఖాల్లో తన ముఖం పెట్టి చూస్తూ సంతోషంలో మునిగిపోయాడు శశాంక్.

అంతా అమితానందంగా ఉన్న ఆ క్షణాల్లో అకస్మాత్తుగా కౌసల్య ఫోన్ మ్రోగింది. మొబైల్ తీసుకుని, "ఇప్పుడే వస్తాను" అని వాళ్ళిద్దరికీ చెప్పి అవతలకు వెళ్ళింది కౌసల్య.

"ఆ వదినా! కాసేపటి క్రితమే డెలివరీ అయింది. ముందుగా తెలిసిన విధంగానే కవలపిల్లలు - బాబు, పాప! చాలా ముద్దొస్తున్నారు వదినా! మహతికేం, భేషుగ్గా ఉంది, గాభరా ఏమీ లేదు! అదేం మాట, నేనొచ్చానుగా, మీరు రాలేకపోయానని బాధ పడకండి. అన్నట్టు మీ కోడలెలా ఉంది? పాపం తను పగవాళ్ళకు కూడా రాకూడనంత దు:ఖంలో ఉంది. పైగా అయిదో నెల! జాగ్రత్తగా చూసుకోండి. మహతి గురించి భయం లేదు, నేను తర్వాత ఫోన్ చేయిస్తాలెండి. ముందు మీరు కోడలిని జాగ్రత్తగా చూసుకోండి. ఏక్సిడెంట్లో కన్నవాళ్ళిద్దరినీ ఒకేసారి పోగొట్టుకున్న దురదృష్టవంతురాలు ఆ అమ్మాయి..." ఫోన్లో కౌసల్య మాటలు కొనసాగుతూనే ఉన్నాయి.

గది బైటకు వెళ్ళినా బిగ్గరగా మాట్లాడుతున్న అత్తగారి మాటలు వింటున్న మహతి కళ్ళు ధారాపాతంగా వర్షిస్తున్నాయి. పశ్చాత్తాపంతో ఆమె మనసు, పక్కనే ఉన్న పసిపాపలంత స్వచ్ఛంగా ప్రక్షాళన అవుతోంది!!




" హలో డాక్టర్ హరీ! అమెరికా నుంచి వచ్చావని విన్నాను. జట్ ల్యాక్ తగ్గిందా? ఐనా నీకేం జట్ ల్యాక్ లే! నీవు దాన్ని లాక్ చేసి, నిద్రపుస్తావ్! ఒక సహాయం అర్ధిస్తూ ఈఫోన్ చేస్తున్నానోయ్! అర్జెంట్ గా మా హాస్పెటల్ కు రాగలవా ! ఒక పేషెంట్ పరిస్థితి ఆందోళనకరంగా ఉంది పాపం.అనాధ,ఎవ్వరూలేరు, ఏడాక్టరైనా ఉత్తినే పనిచేయడు కదా! నీవేమైనా సాయం చేసి, అతగాడి ప్రాణం కాపాడగలవేమోనీ..!" ఆదుర్దాగా ఐనా ఎంతో నిమ్మళంగా అంటున్న డా. ఆనంద్ మాటలు విని రిలాక్సింగ్ మూడ్ లోంచి బయట పడి, " తప్పక వస్తాను. ఐదే ఐదునిముషాల్లో బయల్దేరుతున్నాను." అంటూ జవాబిచ్చి, గబగబా తయారై కారెక్కాడు. పావుగంటలో ' ఆనంద నిలయం ' హాస్పెటల్ చేరి ,డా. ఆనంద్ ను కలిశాడు.

"పేషెంట్ ఎక్కడ ఆనంద్!"

" రా !రా ! ఇదో ఆ తొమ్మిదో నెం. రూంలో ఉన్నాడు." అంటున్న ఆనంద్ కంటే ముందే పరుగులాంటి నడకతో రూం లోకి ఎంటరై, ముందుగా కేస్ హిస్టరీ ప్యాడ్ తీసి చూశాడు . పేరు చదవగానే పేషెంట్ ముఖం చూశాడు, గడ్డం పెరిగి, ముసలితనంతో, వగ్గిపోయి ఉన్న ఆ వ్యక్తిని గుర్తుపట్టలేనట్టున్నాడు. "డా.ఆనంద్ ! ఈయనకు అర్జెంట్ గా ఓపెన్ హార్ట్ సర్జరీ చేయాల్సి ఉంది. ఎందుకు జాప్యం చేశారు ?!" ఆశ్చర్యం గా అడిగాడు డా .హరి . "హరీ! మరి ఇతనికి ఎవ్వరూ లేరు, వృద్ధాశ్రమం నుంచి ఫోన్ వస్తేవెళ్ళి ఆంబులెన్స్ లో తెచ్చాం .సంతకాలూ అవీ పెట్టనూ , కొంతైనా ఖర్చు భరించనూ ఎవ్వరూ లేకుండా కష్టం కదా! మాది ఉచిత హాస్పిటల్ కాదు కదా! నీ లాంటి స్పెషలిస్టుల కన్నా పే చేయాలి కదా !ఏ డాక్టరూ ఉచితంగా చేయడు తన ఫీజ్ వదులుకుని, ఆ విషయం ఇందాకే చెప్పానుకదా! అందువల్ల....." డా.ఆనంద్ చెప్తుండగానే , " ఆనంద్! ఇతడికయ్యే ఖర్చంతా నేను భరిస్తాను , త్వరగా ఆపరేషన్ థియేటర్ కు తరలించి, కావల్సిన ఏర్పాట్లన్నీ చూడండి ."ఉద్వేగం గా అంటున్న హరిని ఆశ్చర్యంగా చూసి అడిగాడు ఆనంద్ .


" నీకు ఇతడు తెల్సా!" అని " ఆనంద్ ! అన్నీ తర్వాత చెప్తాను .ముందు ఇతడ్ని థియేటర్ కు తరలించే ఏర్పాటు చేయండి ప్లీజ్ !.త్వరగా.ఈయనకేమన్నా ఐతే నేను భరించలేను.." ఆదుర్దాగా అంటున్న హరి మాటలను ఆచరణలో పెట్టాడు ఆనంద్. మిట్ట మధ్యాహ్నం ,మార్చి ఎండ మండి పోతున్నది. మధ్యాహ్నం పాఠశాలకు బయల్దేరారు మాధవయ్య పంతులు. గొడుగు వేసుకున్నా ఎండ భరించలేక కండువా ముక్కుకు అడ్డు పెట్టుకుని వడివడిగా నడుస్తూన్న ఆయన , ఎదుటి దృశ్యాన్ని చూసి స్థాణువులా నిల్చిపోయారు. చెత్తదిబ్బలో తిని పారేసిన ఎంగిలాకుల మధ్య కుక్కలతో కల్సి ఎంగిలి మెతుకులు ఏరుకు తింటున్న షుమారు ఐదేళ్ళ పిల్లవాడు. బంగారు బాల్యమిలా కుప్ప దిబ్బల్లో కరిగిపోడం ఆయన మనస్సుకు బాధ కలిగించింది . సాధారణంగా కుక్కలు ఏ కుక్కనూ పక్కన చేరి తమతో తిననివ్వవు, అలాంటిది, ఆ మూడు కుక్కలూ వాడిని తిననిస్తూ తామూ తినడం ఆయనకు ఆశ్చర్యం కలిగించింది . ఓ వైపు కుక్కలు మరోవైపు వాడూ! ఎంగిలి మెతుకులు ఏరుకుని అలాగే గబగబా నోట్లో వేసేసుకుంటున్నాడు. వాడి వంటి మీద ఆచ్ఛాదన ఏమీ లేదు. కప్పవలసిన చోట కప్పని బాగా చిరిగిన లాగూ తప్ప. మాధవయ్య కడుపు దేవేసినట్లైంది ." ఒరేయ్ బాబూ! నిన్నే " అని పిలిచారాయన. జవాబులేదు. రెండు క్షణాలలాగేచూచి దగ్గరగా వెళ్ళి వాడి భుజం పట్టి లేపబోయాడు . పుల్లల్లా ఉన్న మరో చేత్తో ఒక్క తోపు తోశాడు వాడు ఆయన్ని . కడుపులో పడాల్సిన మెతుకులకు ఆటంకం కలిగించే వారెవరైనా కానీవాడు లెక్కపెట్టే స్థితిలో లేడు. అసలు తన నెవరు తాకారోకూడా తలత్రిప్పి చూసే స్థితిలో లేడువాడు.ఆయన వాడి బలానికి ఆశ్చర్య పడి, గొడుగు ముడిచి చంకలోఉంచుకుని దగ్గరగా వెళ్ళి రెండుచేతులతో వాడ్ని పట్టి లేపి కుప్ప దిబ్బమించి పక్కకుతెచ్చాడు . తెల్లనినూలు బట్టలు ధరించి, నుదుట విభూది రేఖల మధ్యగా ఎర్రని కుంకుమ ధరించి అపర శివునిలా ఉన్న ఆ ముఖాన్ని చూడ గానే వాడిలాగు తడిసి పోయింది . భయంతో బిర్ర బిగిసిన వాడ్ని చేయి పట్టుకుని నడిపిస్తూ తన పాఠశాలకు తెచ్చాడాయన. "సుబ్బన్నా! ఎక్కడున్నావ్?" అనగానే ప్యూన్ సుబ్బన్న పరుగు పరుగున వచ్చాడు." చూడూ వీడికి కొళాయి వద్ద స్నానం చేయించి , ఇదో ఈ కండువాతో తుడిచి ఈ యూనిఫాం వేసి ఈ డబ్బు తో వీడ్ని పక్కనే ఉన్న హోటల్ కు తీసుకెళ్ళి కావల్సింది కడుపు నిండా పెట్టించి నా వద్దకు తీసుకురా!" అంటూ భుజమ్మీది కండువాతీసిచ్చి,తన బీరువాలోఉంచిన ఒక జత యూనిఫాం కూడా ఇచ్చి,సుబ్బన్నకు తన జేబులోంచి కొంత డబ్బుతీసి ఇస్తున్న ఆయన్ని వింతగా చూస్తున్న సుబ్బన్న.ఒక్క అర్ధగంటలో శుభ్రంగా కడిగిన ముత్యంలా ఉన్న ఆ

పిల్లాడ్ని తీసుకువచ్చాడు సుబ్బన్న. వాడు కృతజ్ఞత నిండిన కళ్ళతో ఆయన్ని చూస్తూ రెండుచేతులూ కట్టుకుని వినయంగా ,కడుపు నిండటంతో నీతారుగా ఆయన ఎదురుగా నిల్చున్నాడు. "ఇలాగా బాబూ ! నీ పేరేంటి?" అని అడిగారాయన.

" కిట్న " అన్నాడు వాడు మెల్లిగా.

సుబ్బన్న " కృష్ణ అయి ఉంటుంది సార్ !" అన్నాడు.

" కృష్ణా! మీ అమ్మానాన్నా ఎక్కడ?" అని అడిగిన ఆయన మాటలకు , తన చేయి పైకెత్తి కప్పువైపు చూపాడు. ఆయన కళ్ళలో నీరు నిలిచింది . వాడు అమాయకంగా తన వంటి మీదున్న బట్టల వైపు ఆయన వైపూ చూస్తున్నాడు,ఏనాడూ ఇంత శుభ్రమైన, అందమైన బట్టాలు ధరించని వాడి ముఖం చాలాసంబరంగాఉంది." సరే , నీకు రోజూ భోజనం కడుపు నిండా పెట్టిస్తాను , బళ్ళోచేరిచదువు కుంటావా!" అనిఅడిగారు. వాడు ఉత్సాహంగా" ఓ!" అనేశాడు .' కడుపు నిండా తిండి' 'అనేమాటే వాడిని మంత్రం లా కట్టేసింది.వెంటనే మధవయ్య వాడి పేరు పాఠశాలలో అడ్మిషన్ రికార్డులో నమోదు చేసి, గార్డియన్ గా తన పేరు వ్రాసేసు కున్నారు. అదో అలా కృష్ణ బళ్ళో చదువు లోనూ ,రోజూ అన్నం వాడి కడుపులోనూ పడసాగింది . తిండికే కానీ, తెలివికి పేద కాని వాడు చక చకా చదువు లోఎదుగుతూ హైస్కూల్ కూ ఆపైన సిటీ కాలేజ్ కీ పాకి పోయాడు, ఆలంబన దొరికిన లత పై పైకి పాకినట్లు. వాడు తన చదువు ధోరణిలో పడి ,ముమ్మందుకు పయ ని స్తూపోసా గాడు . "డా.హరీ! ఆ పెద్దాయనకు స్పృహ వచ్చింది . కళ్ళు తెరిచాడు." అనే కబురందగానే గబుక్కిన లేచి పరుగులాంటి నడకతో ఆయన ఉన్న గది లోకి వెళ్ళాడు డా.హరి. " పెద్దసార్ ! ఎలా ఉంది ప్పుడు?" అన్న డా.హరిమాటలకు ,చివుక్కున తలత్రిప్పిచూశాడా వృధ్ధుడు. " నా పేరు మీకెలా తెల్సు?"అని అడిగాడు." మీరు మీ హరికృష్ణను గుర్తుపట్టలేదు గానీ ,మీరు నామకరణం చేసి,తిండిపెట్టి, విద్యాగంధం అంటించిన మీ హరి కృష్ణ మిమ్మల్ని మరువ లేదు సార్! ఐతే చదువు పోటీలో కొంత జాప్యం జరిగినమాట వాస్తవం. ఐతేగత ఐదేళ్ళుగా మీ కోసం వెతకని చోటులేదు. ఎవ్వరూ మీగురించిన సరైన సమాచారం ఇవ్వలేక పోయారు, చదువులు, పై చదువులతోకొంత వరకూ పూర్తిగా విచారించని దోషం నాదే! మీరి లా..వృధ్ధాశ్రమలో!?"" హరీ!నీకు నేనింకా గుర్తున్నాన్నా! కన్నబిడ్డలే నన్ను మరచిపోయార్రా! అర్ధాంగి పోయాక వంటరిన్నై, ఎవ్వరికీ తెలినిచోట ఇలా తల దాచుకుంటున్నానోయ్ నా పెన్షన్ సొమ్ముతో . నా ఆదాయమంతా అనాధలపాలు చేశానని కన్న బిడ్డలు వదిలేశారు . కాలంతీరి నా అర్ధాంగి వంటరి వాడ్ని చేసిపోయింది. " కళ్ళమ్మట నీరు కారుతుండగా గద్గదస్వరంతో అన్నారాయన.తన చేతులతో కన్నీరు తుడిచి ,ఆ రెండు చేతులనూ తన చేతు ల్లోఉంచుకుని " మీరు వెలిగించిన ఈ జ్యోతి వెలుగు తూనే ఉంది పెద్దసార్! ఆజ్యోతి వెలుగు మీరు చూడరా! ఆ జ్యోతికి సాయంగా ఉండరా!పెద్దసార్! మీరిక మీ జ్యోతి వద్దే ఉంటున్నారు." అంటూ ఆయన పాదాలకు నమస్కరించి తన చేతుల మధ్య ఆయన చేతులుంచుకుని గుండెలవద్ద పెట్టుకున్నాడు డా.హరికృష్ణ.




బిక్కు బిక్కు మంటూ హాల్లోకి అడుగు పెట్టాడు చైతన్య.

మెల్లిగా వంటింట్లోకి తొంగి చూశాడు. తన తల్లి వంట పనిలో నిమగ్నమైనట్లు నిర్ధారించు కున్నాడు. నెమ్మదిగా తన పుస్తకాల బ్యాగులో నుండి ప్రోగ్రెస్ కార్డు తీసి టి పాయ్ పైన పెట్టాడు. పిల్లిలా నడుచుకుంటూ వెళ్ళి తన గదిలో దూరాడు.

స్కూల్ యూని ఫాం మార్చుకొని ఒక పుస్తకం ముందు వేసుకొన్నాడు. చదువుతున్నట్లు నటిస్తూ.. ఆలోచనలో పడ్డాడు..

'నాన్న ఆఫీసు నుండి రాగానే ప్రోగ్రెస్ కార్డు చూస్తాడు. కోపంతో అరుస్తూనా గదిలోకి వస్తాడు. ఆ అరుపులకు భయపడి నాన్న వెనకాలే అమ్మ కూడా వస్తుంది. ఈ పూటకి నాకు తిట్లే టిఫిను.. దేహశుద్ధే భోజనం' అని మనసులో అనుకుంటూ తేప తేపకు గోడ గడియారం వంక చూడ సాగాడు.

ఇంతలో తల్లి అరుణ "బాబూ!.. టిఫిన్ చేసి పాలు తాగుదువు రా రా.. నీకు ఇష్టమని పకోడి చేసాను" అంటూ తన గదిలోకి రావటం చైతన్యకు కొంత ఊరట లభించినట్లయ్యింది.

“నాకు ఆకలిగా లేదమ్మా.. నాన్న వచ్చాక తింటాలే” అన్నాడు చైతన్య.

“కనీసం పాలైనా తాగరా..” అంది అరుణ బతిమాలుతూ..

“వద్దమ్మా ప్లీజ్.. హోం వర్క్ చాలా ఉంది.. నాన్న వచ్చే లోగా పూర్తిచేసి అందరం కలిసే భోంచేద్దాం..” అంటూ చైతన్య తెచ్చిపెట్టుకున్న ధైర్యంతో తెలివిగా తప్పించుకున్నాడు. కాని కడుపులో భయం ఆందోళన మరింత పెరిగింది.

అరుణ, సత్యం దంపతులకు ఒక్కగానొక్క సంతానం చైతన్య.  చైతన్య తరువాత మళ్ళీ మాతృమూర్తి అయ్యే అవకాశం కోల్పోయింది అరుణ. ఆక్సిడెంట్ వల్ల ఆమె గర్భ సంచి తొలగించుకోవాల్సి వచ్చింది. చైతన్య అంటే వారికి పంచ ప్రాణాలు. ఉన్న ఒక్క నలుసును చక్కటి క్రమశిక్షణతో పెంచి ఉన్నత చదువులు చదివించాలని కలలు కంటున్నారు. అయినా ఒక్కోసారి అరుణ చూపించే మమకారంతో చైతన్య విహంగమై పోతాడు. దాని పర్యవసానమే నేటి చైతన్య ఆరవ తరగతి ప్రోగ్రెస్ కార్డు లోని రిపోర్ట్.

సత్యం ఆఫీసు నుండి రాగానే ఫ్రెష్షై హాల్లో అడుగు పెట్టగానే అరుణ ఆ పూట నివేదిక ఇచ్చింది. ‘చైతన్య టిఫిన్ చేయలేదు.. పాలు తాగలేదు.. ’ అని. ఇదంతా చెవులు నిక్కించి వింటున్నాడు చైతన్య తన గదిలో నుండి.

‘ఇక నాన్న వస్తాడు. బెత్తెం తెస్తాడో!.. బెల్టు తెస్తాడో!.. ’ అనుకుంటూ గజ గజా వణుక సాగాడు.

చైతన్య గది తలుపు తెరుచుకుంది…

భయంతో కంపించి పోతూ “ నాన్నా నన్ను కొట్టొద్దు..” అంటూ అరిచాడు.

“అదేంటి చైతన్యా.. నేనెందుకు కొడతాను?.. ఎప్పుడైనా కొట్టానా?” అంటూ ఎంతో ప్రేమగా దగ్గరికి తీసుకున్నాడు.

చైతన్యకి నమ్మశక్యం కాలేదు. వెనకాలే తన తల్లిని చూసి బావురు మన్నాడు. చివాలున లేచి అరుణ మెడను

వాటేసుకున్నాడు. అరుణ కళ్ళల్లో నీళ్లు తిరిగాయి. చైతన్యను హృదయానికి గట్టిగా హత్తుకుంది.

“చూడు బాబూ!.. శ్రద్ధగా చదవడం చదవక పోవడం నీ ఇష్టం నాన్నా.. చదవటం అంటే పుస్తకం ముందు ఉండటం కాదు. మన మనసు పుస్తకంలో లీనమై పోవాలి. బాహ్య ప్రపంచపు అలజడులు అంతర్ధానమై పోవాలి. అలా చదివే వారు ఒక గంట లేదా రెండు గంటలకంటే ఎక్కువగా చదువలేరు. అప్పటికే బుర్ర వేడెక్కి పోతుంది. ఆ తరువాత కాస్తా మానసిక ప్రశాంత కోసం బయటికి వచ్చి తనకు ఇష్టమైన కార్యక్రమాల్లో కాసేపు దృష్టి సారించి ఆ తరువాత మళ్ళీ గదిలోకి వెళ్ళి ఒక ప్రణాళిక ప్రకారం చదువుకోవాలి” అంటూ చైతన్యను తన బాహు బంధాల్లోకి తీసుకున్నాడు సత్యం. చైతన్య మౌనంగా ఏడుస్తూ ఉండటం అరుణ బుజ్జగించ సాగింది.

“ చూడు చైతన్యా.. నేను చదువే కాలంలో కిరోసిన్ దీపాలే మా పరమావధి. చదువు కోసం మూడు మైళ్ళు కాలి నడకన వెళ్ళే వాణ్ణి. మా నాన్న ‘చిన్న సైకిలు కొనిస్తాను బాగా చదువుకోవాలి’ అంటూ ప్రతీ సంవత్సరం నన్ను ప్రోత్సహించే వాడు. కాని ఏనాడూ కొన్నది లేదు. కాస్తా పెద్దయ్యాక సైకిలు గూర్చి అడిగితే ‘ఇంకా చిన్న సైకిలు ఎందుకురా? నా సైకిలు ఉందిగా వాడుకో’ అన్నాడు. నేను చిన్న సైకిలుపై కూర్చొని సవారి చేయాలనే కోరిక అలాగే ఉండి పోయింది. నేను బాగా చదువుకోవాలని అలా నాన్న అన్నాడే తప్ప సైకిలు కొనే స్థోమత లేదు.

నా కంటే అధ్వాన్న పరిస్థితుల్లో చదువుకొని ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మహాను భావులు ఎందరో ఉన్నారు. అబ్రహాం లింకన్ వీధి దీపాల క్రింద చదువుకునే వాడు. అబ్దుల్‌కలాం బాల్యంలో ఎదుర్కొన్న అష్ట కష్టాలు చెప్పనలవి కాదు. పేదరికం చదువుకు అడ్డంకి కాదని మనం వారిని మనం స్ఫూర్తిగా తీసుకోవాలి.

నీకు ఈనాడు అలాంటి ఆర్థిక ఇబ్బందులేవి లేవు. సకల సౌకర్యాలూ కల్పిస్తున్నాం. బాగా చదువు కోవటం.. చదువుకోక పోవటం నీ చేతుల్లో ఉంది. ఒక సారి ఒక సబ్జెక్టులో ఫెయిల్ అయినంత మాత్రాన అలా దిగాలు పడిపోవద్దు. అపజయాన్ని ఒక గుణ పాఠంగా తీసుకొని దానికి కారణాలేవో బేరీజు వేసుకొని వానిని అధిగమిస్తూ రెట్టింపు ఉత్సాహంతో ముందుకు వెళ్లాలి.. ఇదీ అబ్దుల్‌కలాం గారి మాటే..” అంటూ చైతన్య వీపు నిమురసాగాడు సత్యం.

కళ్ళు తుడ్చుకుంటున్న చైతన్య ముఖంలో పరివర్తన కనపడే సరికి సత్యం కాస్తా ఊపిరి పీల్చుకున్నాడు.

“పద భోంచేద్దాం.. నేను వచ్చాక అందరం కలిసి భోంచేద్దాం.. అన్నావట కదా అమ్మతో..” అంటూ నెమ్మదిగా చైతన్యను నడిపించుకుంటూ డైనింగ్ టేబుల్ దగ్గరికి తీసుకు వెళ్ళాడు.

చైతన్య చేతులు శుభ్రంగా కడిగించింది అరుణ.

చైతన్య భోంచేయ సాగాడు. సత్యం అరుణ తృప్తిగా చైతన్యను చూడసాగారు. వాళ్ళు వడ్డించుకోక పోవట గమనించాడు చైతన్య. మనసులో ఏదో శంక..


“అమ్మా.. మీరు భోచేయటం లేదేంటి..” అంటూ తడబడుతూ అడుగుతూ తన నాన్న వంక చూసాడు చైతన్య.

“నువ్వు ఫెయిల్ కావటానికి మా తప్పిదం కూడా ఉంది బాబూ.. మాకృషిలో ఏదో లోపం ఉంది. అందుకే దానికి శిక్షగా ఈ పూట మేము భోజనం చేయకూడదని నిర్ణయించుకున్నాం.. నువు భోంచెయ్యి.. ” అంటూ జగ్‌లోని మంచినీళ్ళ గ్లాసులో వంచ సాగాడు సత్యం.

ఒక్క సారిగా బావురుమన్నాడు చైతన్య. బిగ్గరగా ఏడ్చేసాడు. కన్నీటి ధారలు నోట్లోకి వెళ్లసాగాయి.

“ఇంకెప్పుడూ ఇలా జరగదు నాన్నా.. నేను శ్రద్ధగా చదువుకుంటాను.. అమ్మా మీరు భోంచెయ్యకుంటే నేనూ చెయ్యను..” అంటూ గ్లాసు లోని నీటితో చెయ్యి కడుక్కో బోయాడు. అరుణ అడ్డుకుంది. తనూ కన్నీళ్ళ పర్యంతమైంది. రెండు చేతులతో చైతన్య తలను తన గుండెలకు హత్తుకుంది.

‘మీరు భోంచెయ్యకుంటే నేనూ చెయ్యను’ అనే మాట సత్యం హృదయాన్ని ద్రవింప చేసింది. తాను అనుకున్న ఫలితం చైతన్యలో కనిపించినందుకు అతడి కళ్ళళ్ళో ఆనంద భాష్పాలు దొర్లాయి.*




ఆ కార్పొరేట్ ఆస్పత్రి నుంచి అడుగు బయటకు  పెడుతుంటే...

నాకు గాల్లో తేలుతున్నట్టుగా ఉంది.

జైలు నుంచి విడుదలయిన ఖైదీలా ఉంది నా మానసిక స్థితి.

మూడు నెలలు  ఎలా గడిచిపోయాయో..

డాక్టర్లు,నర్సులు, వైద్యపరీక్షలు, మందులు..

అప్పుడప్పుడు పరామర్శకు వచ్చే బంధుమిత్రులు...

రాత్రింబవళ్లు ఒకటే సందడి.

కొందరు నన్ను అదృష్టవంతుడివి అంటూ మెచ్చుకున్నారు. మరికొందరు ధైర్యవంతుణ్ణన్నారు. ఇవన్నీ కాదు. నువ్వు క్షేమంగా బయట పడితే అంతే చాలు అన్నారు అమ్మా, నాన్న, చెల్లాయి.

నిజానికి నేను ఈ కాలం కుర్రాడిని. నా ఈడు కుర్రాళ్ళ చాలా మంది మాదిరిగానే... జాలీగా జీవితాన్ని గడపాలనేది నా మనస్తత్వం. నా అభిమాన నటుడితో కలిసి డిన్నర్ చేయాలని, ఓ అందమైన అమ్మాయిని ప్రేమించాలని, అమెరికా వెళ్లి బాగా డబ్బు సంపాదించి ఓ పెద్ద కంపెనీకి ప్రొప్రయిటర్ కావాలని, అందులో నా శత్రువు వసంత్ గాడిని ఉద్యోగిగా నియమించి రోజూ వేధించాలని.. నా సాయం కోసం ఎవరయినా వస్తే...చెక్ బుక్ తీసి వేలల్లో సాయం చేయాలని...ఇలా ఏవేవో పిచ్చిపిచ్చిగా కలలు కంటూండేవాడిని.

అయితే ఇవన్నీ ఒక ఎత్తు... స్పోర్ట్స్ బైక్ కొనుక్కోవాలని... హైదరాబాద్ అవుటర్ రింగురోడ్డులో జామ్ అంటూ వెళ్లాలన్న కోరిక మాత్రం నాకు మనశ్శాంతి లేకుండా చేసేది.

బైక్ పేరెత్తగానే మా బాబు ఇంతెత్తున లేచాడు.

"నేను రాజకీయ నాయకుడిని అనుకున్నావా? వ్యాపారస్థుడిని అనుకున్నావా? లక్షలు పోసి అది కొనిచ్చేందుకు.. ? అంత కోరికగా ఉంటే మంచి ఉద్యోగం సంపాదించుకుని కొనుక్కో" ... హితబోధ చేశాడు.

అలాగని మామూలు బైక్ ఏదయినా కొన్నాడా అంటే అదీ లేదు.

" ఈ సిటీ రోడ్లమీద వాహనాన్ని ఎవడు ఎట్లా నడుపుతాడో తెలీదు. రోజూ ఎవరో ఒకరి చావు వార్తలు వింటున్నాం. ప్రమాదాలలో కాళ్ళూ చేతులు విరగ్గొట్టుకోవటం.. ప్రాణం మీదకు తెచ్చుకోవటం దేనికి?

అసలే మీ కుర్రాళ్లకు బైక్ చేతికందితే చాలు.. ఒళ్ళూపైన తెలియదు." అంటూ లెక్చరిచ్చి...

“హాయిగా కాలేజి బస్సులో వెళ్లు మంచిది. ” అని సలహా ఇచ్చాడు.

దీనితో  ఊరి బయటున్న ఇంజనీరింగ్ కాలేజికి   రోజూ బస్ లోనే  వెళ్లొచ్చేవాడిని.     ప్రయాణం చేసొచ్చేసరికి నీరసం వచ్చేది.   మిగతా కుర్రాళ్లంతా జామ్ జామ్ మని బైక్ ల మీద వెళుతుంటే  కడుపు తరుక్కుపోయేది.

“ కాలేజి బస్సులో వెళితే ఉదయం 9 గంటలకే బయలుదేరాలి. మన పరీక్ష మధ్యాహ్నం రెండు గంటల నుంచి కదా… ముందెళ్లి ఏం చేస్తాం.  బండి మీద వెళదాం. గంట ముందు బయలుదేరితే సరిపోతుంది.”  పరీక్షలు మొదలయ్యే ముందు రోజున ఇంటికి  వచ్చి చెప్పాడు భార్గవ.    “పరీక్షలున్న వారం రోజులూ  బైక్  ప్రయాణమన్న మాట..

అరుదయిన అవకాశం”. తెగ  సంబరపడిపోయాను.

“ మీ డాడీకి తెలిస్తే ఊరుకోరు. జాగ్రత్తగా వెళ్లిరండి”

అమ్మ  పరోక్షంగా  మద్దతు ఇస్తూనే బోలెడన్ని జాగ్రత్తలు  చెప్పి  పంపించింది.

భార్గవ బండి నడుపుతుంటే… నేను వెనక కూర్చున్నా.

మాతో పాటు ఇంకో బండి మీద బయలుదేరారు రసూల్  , చైతన్య.  మధ్యాహ్న సమయం కావటంతో రోడ్లమీద రద్దీ అంతగా లేదు. వాడు వాయువేగంతో నడుపుతున్నాడు. గాల్లో తేలుతున్నట్టుగా ఉంది.  “ మామూలు బైక్ మీద వెళుతుంటేనే ఇంత హాయిగా ఉంటే… ఇక స్పోర్ట్స్ బైక్ మీద వెళితేనా?..

యథావిధిగా కలల్లోకి జారాను.

“ఇంజనీరింగ్ పూర్తికాగానే … క్యాంపస్  సెలక్షన్లో జాబ్ సంపాదించుకోవాలి.  టాప్ మోడల్ బైక్ కొనాలి..”  బలంగా అనుకున్నాను.బైక్ రూపం  కళ్లముందు మెదిలింది.

“ దాని బాడీ బ్లాక్ అయితే బావుంటుందా.. ? మెరూన్ రెడ్డా...? ఈ రెండూ  కాదు... అప్పుడు లేటెస్టుది ఏదయితే అది ఎంపిక చేసుకోవాలి.అమెరికా వీసా వస్తే.. అప్పుడు బైక్ ఏం చేయాలి?

అది చెల్లాయికి ఉపయోగపడదు.  నాన్నకి అసలు ఇలాంటివి నచ్చవు. ఎందుకురా అంత డబ్బులు తగలేసి అని ముందే కసురుకుంటాడు.ఇక అమ్మ... తన కంటూ ప్రత్యేకమైన ఇష్టాలు లేవు. నాకు ఇష్టమైన పనులు చేయమనే ప్రోత్సహిస్తుందెప్పుడూ.మరి ఇంట్లో ఉంచాలా? అమ్మేయాలా?

ఇలాంటివి కొనేవాళ్ళుంటారా? పెద్దగా మార్కెట్ ఉండదేమో?

అంతగా ఇష్టపడి కొనుక్కున్న వస్తువును అమ్మటం దేనికి?

ఓ  మంచి జ్ఞాపకంగా ఇంట్లోనే ఉంచుకుంటే పోలా? ... ”

బండి వెనకే కూర్చుని ...ఇలా ఏదో ఆలోచించుకుంటూ  ఉన్నాను.ఇంతలో  ఏమయిందో తెలీదు..వెనక   నుంచి  ఏదో వాహనం బలంగా ఢీ కొంది...అని మాత్రం అర్థమైంది.ఒక్కసారిగా  నా శరీరం గాల్లోకి ఎగిరింది.“ బంతిలా పైకెగిరి .. అంత పై నుంచి దబ్బున నేలమీద పడితే...హమ్మో .. ఇంకేం మిగులుతుంది.

వెన్నెముక విరగటం ఖాయం.. అంత కంటె ముందు మెదడు చిట్లిపోతుంది.భగవంతుడా... ఈ భూమ్మీద నాకు నూకలు చెల్లిపోయాయి.  కోరుకున్న  బైక్ కొనుక్కోకుండానే  ఈ లోకం విడిచి వెళ్ళిపోతున్నాను.

నాన్నా ... నన్ను క్షమించు. నీ మాట వినకుండా బండి పైన వచ్చి... ప్రాణం మీదకు తెచ్చుకున్నా... అక్కడికీ నువ్వు ముందే నన్ను ముందే హెచ్చరించావు కూడా.అమ్మా ... నువ్వు నేను అడిగినవన్నీ చేశావు.. బండి మీద వెళ్ళాలన్న నా చివరి కోరిక కూడా తీర్చావు.  ధన్యవాదాలమ్మా .. రేపట్నుంచి చెల్లాయి ఒక్కతే ఉంటుంది. దాన్ని బాగా చూసుకో...అన్నట్టు దానికి ప్రతి చిన్న విషయానికి ఏడిపించేవాడిని.. అదంతా నేను ఇష్టంతోనే చేశానని దానికి చెప్పవూ...” కొన్ని క్షణాలు గడిచాయోమో... గాల్లోకి లేచిన శరీరం... తిరిగి కింద పడుతున్నట్టుగా నాకు

అర్థమవుతోంది.రెప్పపాటులో ఏదో తెలియని అదృశ్యశక్తినాలో ప్రవేశించింది.

కింద పడినా తల పగలకుండా చేతులు కవచంలా అడ్డంపెట్టుకున్నాను.దబ్బున కిందకు జారాను ... రోడ్డుకు కొద్దిగా పక్కగా... రోడ్డు వేయటానికి కంకర ఉంచినట్టున్నారు . వెనకభాగంలో కసుక్కున గుచ్చుకున్నాయి. శరీరాన్ని అటూ ఇటూ యిటూ కదిపి చూశాను.నా అదృష్టం.. తల పగలలేదు కుడి మోకాలు ఎముక విరిగినట్టనిపించింది. భరించలేనంతగా నొప్పి ... విలవిలలాడిపోతున్నాను.మరో వైపు మగత కమ్ముతున్నట్టుగా అనిపించింది. అతి కష్టం మీద కళ్ళు తెరిచి చూశాను.

నాలుగు చక్రాల వాహనం ఒకటి వేగంగా నా మీదకు దూసుకువస్తోంది.భయంతో మళ్లీ కళ్ళు మూసుకున్నాను.'ఒక ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడిన నన్ను వెంటాడుతూమళ్లీదూసుకొస్తున్న మృత్యువు ...వణికిపోయాను.కీ... చ్.... ఏదో శబ్దం..కళ్ళు తెరిచి చూస్తే..సరిగ్గా నా తల భాగాన్ని ఆనుకుని ఆగింది ఆ వాహన చక్రం...

అంటే ..వాహనాన్ని నడుపుతున్న వ్యక్తి... బాగా నిపుణుడై ఉండాలి. సడన్ బ్రేక్ వేసి వాహనాన్ని నియంత్రించాడు .అతను వాహనం దిగి వచ్చి... కిందపడి ఉన్న నా వైపు ఆత్రంగా... ఆందోళనగా ... చూస్తున్నాడు. కళ్ళు మూతపడుతున్నాయ్..స్పృహ తప్పితే ప్రాణం పోతుందట... అంతకు ముందు ఎక్కడో చదివాను. అందుకే విపరీతంగా బాధగా ఉన్నా ... బలవంతంగా కంట్రోల్ చేసుకోటానికి ప్రయత్నిస్తున్నా. చుట్టూ జరుగుతోంది తెలుస్తూనే ఉంది..

ఎవరో వాటర్ బాటిల్ మూత తీసి కొన్ని నీళ్ళు ముఖం మీద చిలకరించారు.దాహం.కళ్ళు మూసుకునే చేతిలో నుంచి సైగ చేశాను.''వద్దొద్దు.. మంచి నీళ్లు ఇవ్వకండి..'' అంటున్నారెవరో...ప్రమాదం సంభవించిన ప్పుడు బహుశా అలా తాగటం సరికాదేమో నాకు తెలీదు..ఇంకెవరో అంటున్నారు. '' ముందు 108 వాహనాన్ని పిలవండి...'' అప్పటికే జనం మూగుతున్నట్టున్నారు. వాళ్ల మాటలు నా చెవిన పడుతున్నాయి.

'' ఎలా జరిగింది.. మనిషి ప్రాణానికి ప్రమాదం ఏం లేదు కదా.?''''బాగా రక్తం పోతున్నట్టుంది.. '''' దెబ్బలు తీవ్రత ప్రమాదం జరగ్గానే తెలీదండి. నాలుగయిదు గంటల తర్వాత గానీ పరిస్థితి అర్థం కాదు...'''' అబ్బబ్బ.... ఇక్కడ ప్రమాదం జరగని రోజు లేదు. నిన్న కూడా బైక్ మీద వచ్చిన ఇద్దరు కుర్రాళ్లు పోయారు..'''' అడ్డం లేవండి... పాపం అతనికి గాలి ఆడనివ్వండి...''అరిచారెవరో... సెల్ మోగింది.'' మా ఓనర్ తొందర చేస్తున్నాడు. నేను వెళ్లాలి బాబూ'' వాహనం డ్రైవర్ అనుకుంటా... ఎవరితనో చెబుతున్నాడు.

అప్పుడు గుర్తొచ్చాడు భార్గవ.“ ఏమయిపోయాడు వీడు. బండి వెనక కూర్చున్న నేను కిందపడినా గుర్తించలేకపోయాడా? ...రసూల్, చైతన్య కూడా కాలేజికి వెళ్లిపోయుంటారు.

నేను మాత్రం ఇలా...ఒళ్లంతా సలపరంగా ఉంది. జీన్స్ ప్యాంటు రక్తంతో తడిచిపోయి కనిపిస్తోంది. బహుశా మోచిప్పలు పగిలి ఉంటాయి. మోచేతులు బాగా కొట్టుకుపోయాయి. మంట పుడుతోంది. ప్యాంటు, చొక్కా విప్పితేగానీ అసలు ఎక్కడెక్కడ దెబ్బలు తగిలాయో తెలిసే పరిస్థితి లేదు. ఈలోపు 108 వాహనం వచ్చింది. అందులో నుంచి దిగిన నలుగురు వ్యక్తులు మెల్లగా ఎత్తి లోపలకి కూర్చుబోట్టారు.

అప్పుడు కనిపించాడు భార్గవ.

“సారీ రా ... వెనక నుంచి నువ్వు జారి పడినా గుర్తించలేకపోయాను. సరిగ్గా కాలేజి దగ్గరకు వెళ్లగానే చూసుకున్నా. గబుక్కున పరిగెత్తుకుంటూ వచ్చా”... వాడు చెబుతున్నాడు.“ మరి పరీక్ష...” ఆందోళనగా అడిగాను.“ నువ్వేం అయిపోయావో నని భయపడివచ్చా...పరీక్ష సంగతి ఆలోచించలేదు” నాకెందుకో దు:ఖం వచ్చింది.అది వాడన్న మాటలకా? శరీరం పెడుతున్న బాధగా... అన్నది అర్థం కాలేదు.

ఈ లోగా 108 సిబ్బంది ప్రాథమిక చికిత్స చేశారు. దగ్గర్లో ఉన్న ఓ కార్పొరేట్ ఆసుపత్రి పేరు చెప్పి అక్కడకు తీసికెళుతున్నట్టు చెప్పారు.“అప్పుడెప్పుడో రక్తదానం చేద్దామనుకుంటే... ఇదేంట్రా.. లోపల ఉన్నదంతా పోతోంది. ఇదంతా సీసాల్లోనింపుకుంటే ఓ పది మందికయినా ఈ రక్తం సరిపోతుంది” గంభీరమైన వాతావరణాన్ని మార్చటానికి నవ్వుతూ చెప్పాను. భార్గవ నవ్వలేదు. నా వంక జాలిగా చూశాడు. జేబులో నుంచి తనమొబైల్ తీస్తుండగా ....“ఇంతకీ నా మొబైల్ ఏమయినట్టు? అక్కడెక్కడో పడిపోయుంటుంది. ”అమ్మ నెంబర్ అడిగాడు...

“వద్దు. తను భయపడుతుంది...” చెప్పాను. “ మరి డాడీకి తెలిస్తే... తిడతాడు కదా... ” సందేహంగా అడిగాడు. “ మనం చేసింది తప్పే కదా.. తిట్టనీ ... డాడీ లేకుండా హాస్పిటల్ కి వెళ్లలేం ...”నా నిబ్బరం వాడిని ఆశ్చర్యపరిచినట్టుంది. ఫోన్ కోసం ప్రయత్నిస్తుంటేనా పక్కనే కూర్చున్న సిబ్బంది చెప్పారు. “ భయపడకు... ఓ నాలుగు రోజులు ఆసుపత్రిలో ఉంటే మామూలయిపోతుంది”.

నేను నవ్వుతూనే చెప్పాను.“ పోనీలే... వికలాంగుల కోటాలో ఉద్యోగం సంపాదించుకుంటా... ”“ అలా అనకు బాబూ...నీకేం కాలేదు..” ఊరడించే ప్రయత్నం చేశాడు 108 వాహనంలో ఉన్న వ్యక్తి ఒకరు.“ మా అబ్బాయిదీ నీ వయసే... ఇలా బండి మీద వస్తూ ప్రమాదానికి గురయ్యాడు.చిన్న సర్జరీ చేసి కాలికి రాడ్ వేశారు. తర్వాత మామూలయిపోయింది.”“ అంటే.. నాకు కూడా కాలికి రాడ్ వేస్తారన్న మాట. ” నాలో నేను అనుకున్నట్టుగా ఆ మాట

పైకే అన్నాను.

అతను జవాబు చెప్పలేదు. మౌనంగా నా వైపు చూశాడు.“... మీ డాడీరా... లైన్లో ఉన్నారు. ఏం చెప్పమంటావు” - భార్గవ అడుగుతున్నాడు.“ ఆసుపత్రికి రమ్మను...”అంతకు ముందే నన్ను ఎక్కడికి తీసుకెళ్లాలనేది డ్రైవర్ కి చెబుతూండగా విన్నాను. ఆ కార్పొరేట్ ఆసుపత్రి పేరు చెప్పాను.

“ వాడికి ఏమైనా ప్రమాదమా? పరీక్షకు వెళ్లలేదా? ఇంత సేపు ఎక్కడున్నారు?” భార్గవ చెప్పేది పూర్తికాకుండా డాడీ వరుస ప్రశ్నలతో వాడిని ఉక్కిరిబిక్కిరి చేశాడు. భార్గవ సమయస్ఫూర్తిని ఉపయోగించాడు.“ వాడికేం కాలేదు అంకుల్. నాకే చిన్న యాక్సిడెంట్. మా వాళ్లకు చెబితే తిడతారు. కొంచెం మీరొస్తే...”“ నువ్వేం భయపడకు. ఆఫీసు పని మీద నేను సిటీలో చాలా దూరం వచ్చాను. ఎవరిదయినా టూవీలర్ అడిగి నీదగ్గర కొస్తాను. గంట, గంటన్నర పడుతుంది”

“ ఫరవాలేదంకుల్. అంత వరకూ నా కాలేజి ఫ్రెండ్ స్ తో ఉంటా...” చెప్పి ఫోన్ పెట్టేశాడు.”ఆ తర్వాత నా వైపు తిరిగి కబుర్లు చెప్పటం మొదలుపెట్టాడు.

నా అభిమానటుడి కొత్తసినిమా.. దాని దర్శకుడు, హీరోయిన్లు ... ఇతర వివరాలు చెబుతున్నాడు.భార్గవ నేను బాధపడకుండా ప్రయత్నం చేస్తున్నాడని అర్ధమయింది. బాధ భరించలేకపోతున్నా ... ఆ విషయం బయటపెట్టకుండా సాధ్యమయినంత మామూలుగా ఉంటున్నా నేను ...కొన్ని గంటల క్రితం నవ్వుతూ ... తుళ్లుతూ... కాలేజికి బయలుదేరాను. ఇంతలో ఈ ప్రమాదం.. ప్రమాదాలు అంతేనేమో .. అనుకోకుండా వచ్చి పడతాయి. కన్నుమూసి కన్ను తెరిచేలోగా ఊహించని విధంగా జీవితాన్ని మలుపు తిప్పుతాయి.

నా జీవితం కూడా ఇలా మలుపు తిరగబోతోందా?... ఆసుపత్రి వచ్చినట్టుంది. వాహనాన్ని ఆపారు. అప్పటికే నా ప్యాంటు మోకాలి దిగువభాగాన్ని కత్తిరించి ఉంచారు. రక్తస్రావం మాత్రం ఆగలేదు.“ యాక్సిడెంటా? పోలీస్ స్టేషన్ కి వెళ్లారా? కేసు పెట్టారా?... ప్రశ్నల మీద ప్రశ్నలు.. స్ట్రెచర్ ని తెచ్చి వరండాలో ఉంచారు. లోపలకి అనుమతిచటంలేదు.“ వాళ్లడాడీ వస్తున్నారు. ఈ లోపు వైద్యం ప్రారంభించండి .”రిసెప్షన్ దగ్గర బతిమాలుతున్నాడు భార్గవ. చాలా పెద్దవాడిలా, అనుభవం ఉన్న వాడిలా వ్యవహరిస్తున్నాడు.అవన్నీ నా చెవిన పడుతున్నాయి. వాళ్లు ఒప్పుకోవటం లేదు. ఆ విషయం తెలుస్తూనే ఉంది. ఇంతలో ఎవరికో ఫోన్ చేశాడు.“ మా ఫ్రెండ్.. యాక్సిడెంట్ అయ్యింది... ఆసుపత్రిలో చేర్చుకోనంటున్నారు” ఎవరికో చెబుతున్నాడు. ..అవతల వ్యక్తి మాట్లాడింది అర్ధం కాలేదు. కానీ నన్ను లోపలకి తీసికెళ్లటానికి లోపల నుంచి ఆసుపత్రి సిబ్బంది వచ్చారు.

“ డాక్టర్ చంద్రమౌళి.. టెన్ త్ లో నా క్లాసుమేట్ రోహిణి వాళ్ల నాన్న. ఆయనతో మాట్లాడా.” తనే చెప్పాడు నా దగ్గరకు వచ్చి. అల్లరి చిల్లరిగా ఉండే భార్గవ వ్యవహరిస్తున్న తీరు నాకు ఆశ్చర్యం కలిగిస్తోంది.నేను లోపలకి అడుగుపెడుతూండగా వచ్చారు చైతన్య, రసూల్.ఇద్దరూ ఆప్యాయంగా చేతులో చెయ్యి వేశారు. “ భయపడకురా... అంతా బాగా జరుగుతుంది. అల్లానీకు మంచి చేస్తారు” అన్నాడు రసూల్.“మన హెడ్ తో మాట్లాడా. పరీక్ష గురించి భయపడకు. ” చైతన్య చెప్పాడు.“ నీ విషయం తెలిసి పరిగెత్తుకొచ్చాం... ” వాళ్లిద్దరూ కూడా పరీక్ష పక్కన పెట్టేసి.. నా కోసం వచ్చారని అర్థం అయ్యింది.“ ఇంట్లోపెద్దవాళ్లతిడతారన్న భయం లేకుండా .. స్నేహితుడి కోసం...నిజం చెప్పాలంటే ... వీళ్లంతా రెండు నెల్లక్రితం ఇంజనీరింగ్ కాలేజిలో పరిచయం అయిన వాళ్లే ... అయినా నా కోసం... ”

ఈ లోగా డాడీ వచ్చారు. మొహంలో ఆందోళన.. భయం స్పష్టంగా కనిపిస్తోంది.ఒళ్లంతా చెమటతో ముద్దయి ఉంది. నన్ను చూడగానే వెక్కివెక్కి ఏడవటం ప్రారంభించారు. అప్పటి వరకూ ధైర్యంగా ఉన్నవాడిని.. గుండెల్లోబాధను బలవంతంగా అదిమి పెట్టుకున్నవాడిని. .. నేనూ తట్టుకోలేకపోయాను.“ ఊరుకోండి అంకుల్. మీరే అలా అయితే.. వాడి పరిస్థితి ఏమిటి? మీరు ధైర్యంగా ఉండండి. అంతా చక్కబడుతుంది” భార్గవ పెద్దమనిషిలా నాన్నను ఊరడిస్తున్నాడు.“ నువ్వేంటిరా? ఇప్పటి వరకూ పెద్ద హీరోలా ఫోజ్ కొట్టావ్.. ఇప్పుడు ఇలా జావగారిపోతున్నావే..” కవ్విస్తున్నట్టుగా అన్నాడు.

నా దు:ఖం ఆగింది. మామూలుగా ఉండటానికి ప్రయత్నించసాగాను. అయితే శరీరం పచ్చిపుండులా ఉంది. కళ్లు మూసుకుంటే యాక్సిడెంట్ గుర్తుకొచ్చి నన్ను కలవరానికి గురిచేస్తోంది. బలవంతంగా కళ్లు తెరిచే ఉంచుతున్నాను.“ హలో హీరో.. బైక్ తో ఎవరిని ఢీకొట్టావ్? ” జోవియల్ గా పలకరించాడు డాక్టర్.నేను నవ్వలేకపోయాను. కళ్లుమూతలు పడ్డాయ్...ఆ తర్వాత ఐసియూలోకి తరలించారు. రెండు మూడురోజుల తర్వాత అనుకుంటా.. ... ప్రత్యేక గదిలోకి మార్చారు. వేర్వేరు డాక్టర్లు.. రకరకాల మందులు, . ఎన్నో వైద్య పరీక్షలు... పచ్చనోట్లు చకచకా కదిలివెళ్లిపోయాయి. ఇక్కడున్నన్ని రోజులూ ఇంజనీరింగ్ కాలేజి స్టాఫ్, స్టూడెంట్స్ ఎవరో ఒకరు వచ్చి పోతూండేవారు. నాకు సమయమే తెలిసేది కాదు.

ఇప్పుడు ఇంటికి బయలుదేరే సమయం వచ్చింది. . “ మెనీ హేపీ రిటర్న్స్ ఆఫ్ ది డే”...నా మంచం చుట్టూ చేరి అందరూ కోరస్ గా చెప్పారు.బదులుగా నవ్వాను.మంచానికి అటువైపు అమ్మ, చెల్లి, నాన్న..రెండో వైపు నా స్నేహబృందం.. భార్గవ, రసూల్, చైతన్యలతో పాటు మరో ఐదారుగురు... నా పుట్టిన రోజు సందర్భంగా అందరూ ఇంటికి వచ్చారు. అభినందనలతో ముంచెత్తారు.

ఇది భార్గవ గాడి ఆలోచనే. “ దేముడి దయ వల్ల వీడు బతికి బయట పడ్డాడు. ఇంత త్వరగా కోలుకుంటాడని అనుకోలేదు” గుడ్లల్లో నీళ్లు కుక్కుకుంటూ అమ్మ చెప్పింది.చెల్లి కళ్లల్లోనూ నీళ్లు.నాన్న ఎప్పటి మాదిరిగానే గంభీరంగా

ఉన్నారు. '' బోలెడు రక్తం పోయింది. బిడ్డ విలవిలలాడిపోయాడు.'' ప్రమాద సంఘటనను గుర్తుచేసుకుంటోంది అమ్మ.ఆ రోజు ధైర్యంగా ఎలా ఉండగలిగానో నాకే అర్థం కావటంలేదు. బహుశా అదే నన్ను కాపాడిందేమో... రక్తంతో తడిసిన బట్టలను పక్కన పడేశారు. పక్కనున్న షాపు నుంచి అప్పటికప్పుడు కొత్తబట్టలు తెచ్చారు నాన్న .

తెల్లవార్లూ ఆస్పత్రి బయటే గడిపారు.మరుసటిరోజు ఉదయానికి గానీ అమ్మకి విషయం తెలియదు. చెల్లితో కలిసొచ్చింది.నన్ను చూడగానే శోకాలు ప్రారంభించింది.'' అమ్మా ... ఇలాగయితే నువ్వు రావద్దు'' గట్టిగా చెప్పాను. ఆ తర్వాత ఆమె కన్నీళ్లు పెట్టుకోవటం నా కంట పడలేదు.

రాత్రి పగలు సేవలు చేసింది. సమయానికి మందులు వేయటం దగ్గర్నుంచి .. బాత్రూంకి వెళ్లటం వరకూ... అంతే కాదు.. ఎముకలు శక్తిని పుంజుకునేందుకట... రోజూ ఏవేవో వండి పెడుతూనే ఉంది. వాకర్ సాయంతో మెల్లగా మంచం మీద నుంచి లేచాను.నేను కేక్ కట్ చేయగానే ఒకరి తర్వాత మరొకరు చిన్న ముక్క తుంపి నా నోట్లోపెట్టారు. ఉక్కిరిబిక్కిరయ్యా.'' దేముని దయ వల్లబిడ్డ బయటపడ్డాడు. షిర్డీవెళ్లిబాబా దర్శనం చేసుకోవాలి..

ఆ తర్వాత తిరుపతి ...నడిచి కొండెక్కాలి. శ్రీశైలం కార్తీక మాసంలో వెళ్లాలనుకున్నా.. అటుకూడా వెళ్లిరావాలి.. ..''' ముందు వాడు పూర్తిగా కోలుకోనీ.. ఆ తర్వాత ఈ మొక్కుల సంగతి చూద్దాం...''మధ్యలోనే అడ్డుకున్నారు నాన్న. దేముడి దయ వల్లనేను బతికి బయట బట్టకట్టానని ఆమె నమ్ముతోంది. నేను కొద్దిగా తిరగగలిగితే పుణ్యక్షేత్రాలకు తీసికెళ్లిమొక్కు చెల్లిద్దామని ఆరాటపడుతోంది. దు:ఖాన్ని నియంత్రించుకోలేకపోతుందనుకుంటా. చీర కొంగు అడ్డుపెట్టుకుని... ముక్కు చీదుతూ మాట్లాడుతోంది.ఆ వాతావరణంలో ఉక్కిరిబిక్కిరవుతున్నాను.

నాన్న... నేను కోరిన బండి కొనివ్వలేదనే కాదు. ప్రతి విషయానికి కఠినమైన ఆంక్షలు పెడతారని ఆయనని తెగ విసుక్కునే వాడిని. ద్వేషించేవాడిని కూడా. నాకు ప్రమాదం జరిగిందని తెలియగానే ... ఆయన విలవిలలాడిపోవటం, చిన్నపిల్లాడిలా రోదించటం నిజంగా నన్నుకదిలించింది. ఆయన నన్ను ఎంతగానో ప్రేమిస్తున్నారో అర్థం చేసుకోగలిగాను.''డబ్బెంతయినా ఫరవాలేదు. మంచి వైద్యం అందించండి'' అనేవారు డాక్టర్లుఎప్పుడొచ్చినా...ఆయన ఖర్చుకు వెరవలేదు. చికిత్సకు వెనకడుగు వేసింది లేదు. ఓ ప్రయివేటు కంపెనీలో పనిచేస్తున్న ఆయనకిది మోయలేని భారమని నాకు తెలుసు. అయినా పరిపూర్ణంగా తన బాధ్యతలు నెరవేర్చారు.నా కళ్లుచెమర్చాయి.అమ్మ వైపు చూస్తూ..'నువ్వు చెప్పినట్టే అన్ని మొక్కులు తీర్చుకుందాం. అంతకు ముందు నేను కొందరికి కృతజ్ఞత చెప్పుకోవాలి '' అన్నా. భార్గవను ఆత్మీయంగా దగ్గరకి తీసుకున్నాను. ఆ తర్వాత రసూల్, చైతన్యల చేతుల్లోచెయ్యి వేశాను.

'' నిజమే.. ఏం చేసినా వీళ్లరుణం తీర్చుకోలేం. ఈ రోజు మన బిడ్డ మన కళ్లముందు తిరుగుతున్నాడంటే.. వీళ్లందించిన

సహకారం మాటల్లోచెప్పలేను''నాన్న నోటివెంట నేను చెప్పాలనుకున్న మాటలే వచ్చాయి. ''ఈ నలుగురు స్నేహితులు రేయింబవళ్లువాళ్లునా సమక్షం లోనే ఉన్నారు. తమ ఇంట్లోపెద్ద వాళ్లుతిడతారన్న భయం లేకుండా ...నన్ను రోజంతా సంతోషంగా ఉంచటానికి ప్రయత్నించారు .ఈ రోజుల్లో ఇలాంటి వారు అరుదు...''నా కళ్లల్లో నీళ్లు తిరుగుతున్నాయి. '' వీళ్లేకాదు.. ఆ రోజు రోడ్డుపైన పడి ఉన్న నాకు..వెంట్రుక వాసి దూరంలో వాహనాన్ని బలవంతంగా ఆపకపోతే..అప్పుడే నాప్రాణాలు గాలిలో కలిసి పోయి ఉండేవి.. ఆ మోటాడోర్ డ్రైవర్ ఎంత చాక చక్యంగా వ్యవహరించాడు. 108 సిబ్బంది, ఆపరేషన్ చేసిన డాక్టర్ , నేను మామూలుగా నడవటానికి ప్రయత్నిస్తూ ఫిజియోథెరపీ చేసే వ్యక్తి... ఇలా ఎందరో...వీళ్లంతా నన్ను కంటికి రెప్పలా కాపాడలేదూ... తిరిగి నన్ను మామూలు మనిషిని చేయటానికి ప్రయత్నించ లేదూ...ఏం చేసి వీళ్లరుణం తీర్చుకోగలను..''

నా గుండెల్నిండా కృతజ్ఞత పొంగి పొర్లింది. అదేమిటోగానీ.. ఇప్పుడు నా చుట్టూ ఉన్న వ్యక్తుల్లోదైవాన్ని చూడగలుగుతున్నాను.వాళ్లంతా దేముళ్లకు ప్రతినిధుల్లా... ప్రేమకు ప్రతిరూపాల్లా... కనిపిస్తున్నారు.నిజం చెప్పాలంటే.. సరదా సరదాగా గడిపే నాకు ఈ ప్రమాదం జీవితం విలువను తెలియచేసింది.చుట్టూ ఉన్న వ్యక్తుల్ని అర్ధం చేసుకోనేలా చేసింది. అదే జరగకపోయి ఉంటే ఈ ప్రపంచాన్ని ఇంతలా అర్ధం చేసుకోలేకపోయేవాడినేమో....

అందుకే.. ఈ ప్రమాదాన్ని నా మనసు పొరల్లో భద్రంగా పదిలపరుచుకోవాలనుకుంటా. జీవితకాలం ఓ మంచి జ్ఞాపకం గా మిగుల్చుకుంటా.




'టు డు ఆర్ నాట్ టు డు" మీమాంస ప్రతి మనిషికి జీవితంలో ఏదో ఒక రోజు ఎదురు పడక మానదు.

అదిగో అలాంటి సందిగ్ధం లోనే నేనిప్పుడు కొట్టుమిట్టాడుతున్నాను. అసలు ఫలానా పని చేద్దామా, వద్దా? చేస్తేఏమౌతుందో, చేయకపోతే ఏమౌతుందో అనే సందిగ్ధం ఉంది చూశారూ ... అది మహా చెడ్డదండి. అందులోనూ మనకు మరీ సన్నిహితులు అనుకున్న వారి దగ్గర 'అటువంటి విషయం ' చెప్పాలా, వద్దా అనే డోలాయమాన పరిస్థితి అనుభవంలోకి వస్తేకాని ఆ నరకయాతన తెలియదు. చెబితే ఎలా రిసీవ్ చేసుకొంటారో అని ఒక ప్రక్క, చెప్పకపోతే 'ఏంటండీ! ఇంత సన్నిహితంగా ఉండీ, విషయం తెలిసి కూడా మీరు చెప్పలేదు. ముందుగా చెప్పిఉంటే మేము జాగ్రత్తపడి ఉంటాం కదా! ఇలాంటి పరిస్థితి వచ్చివుండేది కాదు కదా! " అని అంటారేమో అని అనుమానం.

మంచి విషయం అయితే ఫర్వాలేదు కానీ ... ఇలాంటి విషయం చెప్పడం భావ్యమా? అదీ ఒక ఆడ కూతురి విషయంలో ... పోనీ ఎవరి సలహా అయినా తీసుకొందామా అంటే ..? 'విషయం' అనవసరంగా పబ్లిసిటి

అవుతుందేమో ... ఆడపిల్ల జీవితం అల్లరిపాలవుతుందేమో అని అనుమానాల మీద అనుమానాలు.

మనస్సు అల్లకల్లోలంగా ఉంది.

వీటి కంతా మూలకారణం మా ఆవిడ. ఇంతకీ ఏం జరిగిందంటే ...

"మన కావేరి లేదూ ...అదేనండీ! మన హౌస్ ఓనర్ కూతురు.. ఆ అమ్మాయి ఆ కుర్రాడితో లేచిపోతుందట" గొంతు తగ్గించి చెప్పింది.

"ఏమిటీ! లక్ష్మీ! నువ్వు చెప్పేది?" పక్కన బాంబు పడ్డట్టు అదిరిపడ్డాను.

"అవునండీ! కావేరే స్వయంగా నాతో చెప్పింది. అప్పట్నుంచి మనసు మనసులో లేదు. ఏమి చేయాలో తోచలేదు. ఆ అమ్మాయి చెప్పడం చూస్తుంటే, వచ్చే వారం తిరుపతి లో పెళ్ళి చేసుకోవడానికి అన్నీ ఏర్పాట్లు చేసుకొన్నట్లు తెలుస్తోంది. వాళ్ళ అమ్మా నాన్నలకు చెప్పలేదట. చెబితే ఒప్పుకోరట. అటు అబ్బాయి తలిదండ్రులకూ తెలియదట. వీరిద్దరే కొందరి ఫ్రెండ్స్ తో .....నాకేదో భయంగా ఉందండీ! " ఆమె పెదాలు అదురుతున్నాయి.

నేనింకా ఆశ్చర్యం నుండి తేరుకోలేదు.

కావేరి ... ఇంకా ఇరవై ఏండ్లు కూడా నిండని అమాయకురాలు ... లెక్చరర్ తో లేచిపోవడమా? అదీ తలితండ్రులకు తెలియకుండా...అంత తెగింపా ... ఎక్కడినుంచి వచ్చింది. నమ్మశక్యం కావడం లేదు.

సంవత్సరం క్రితం ఈ వూరికి ట్రాన్స్ఫర్ అయి జాయినైనా రోజే రఘురామయ్య ఏదో పనిమీద మా బ్యాంకు కు వచ్చాడు. ఎవరో కొలీగ్ అతన్ని పరిచయం చేస్తూ "ఇల్లేదైనా అద్దెకు చూడు సార్ కు! "అన్నాడు.

పేరు, వూరు, స్వస్థలం అడిగాడాయన. స్వస్థలం "చిత్తూరు" అనగానే, '' మనూరే " అని గట్టిగా నవ్వుతూ ,

'ఎక్కడో ఎందుకు మా ఇల్లే ఉంది.  రండి సార్! చూద్దురు!' అన్నాడు.

అలా పరిచయ మయింది  రఘురామయ్యతో.    వాళ్ళింట్లోనే అద్దెకు కింది పోర్షన్ లో   దిగాను. పై పోర్షన్ లో వాళ్ళుంటారు.  ఆయనది కూడా చిత్తూర్రే.   కానీ, అత్తగారిళ్ళు నాయుడుపేట.   వారికి ఒకే ఆడపిల్ల కావడంతో అక్కడే సెటెల్ అయిపోయాడు.

అతను ఒక ఎలిమెంటరీ స్కూల్ హెడ్మాస్టర్ గా  పనిచేస్తున్నాడు.  వారానికి ఒకసారి వచ్చిపోతుంటాడు.      ఆయన చాలా మృదుస్వభావి.  నెమ్మదస్తుడు.  చాలా మంచివాడు.  అతనికి పూర్తి విరుద్ధం అతని భార్య  -అనసూయమ్మ. సినిమాల్లో సూర్యకాంతం టైప్.  ఆమె గయ్యాళి. అతను నోరు వాయి లేనివాడు. ఎలాగో సర్దుకుపోతుంటాడు.  ఆమె ఎప్పుడూ, పై పోర్షన్లోనే ఉంటుంది.  పెద్దగా కిందికి దిగి రాదు.  వచ్చిందంటే ఆ రోజు ఎవరికో మూడుతుంది.  నోరు అంత మంచిది  కాదు.  మంచి ...చెడ్డా ఉండదు.  ఎంత పడితే అంత... ఎంతడివాడినైనా సరే .  ఒక్కోసారి ఈ పిల్లి పాలు తాగుతుందా ... అన్నంత అతి మంచిగా ఉంటుంది.  చాలా చిత్రమైన మనిషి.  చుట్టుపక్కల వా ళ్ళు  ఆమెకు మెంటల్ అంటారు.   పైకి కనిపించడు కానీ, అతన్ని చూస్తేనాకే జాలేసేది.   ఎన్ని ఉన్నా సర్దుకు పోతున్నాడు కాబట్టి వారి సంసారం  ఇంకా అలా సాగుతూ ఉంది.

కానీ, మాతో ఆమె ప్రవర్తన బాగానే ఉండేది.  మర్యాదగానే ఉండేది.  మా ఆవిడ కూడా కలుపుగోలు మనిషే...ఏమాత్రం తేడా వచ్చినా  దూరంగా పెట్టే మనస్తత్వం.  ఎవర్ని, ఎక్కడ, ఎలా పెట్టాలో మా ఆవిడ బాగానే మెనేజ్ చేసేస్తుంది. కాబట్టి ఇంతవరకు మాకెలాంటి ప్రాబ్లెమ్స్  లేవనే చెప్పాలి.  నేను ఆఫీస్ కు  ఉదయం పోతే రాత్రికి వచ్చేవాణ్ణి కాబట్టి నాకెలాంటి సమస్యా లేదు.

ఎపుడైనా ఎదురు పడినా, "బాగున్నారా సార్?" అని ముక్తసరి పలకరింపులు తప్ప...అంతకు మించి మా మధ్య పలకరింపులు , మాటలు ఉండేది కాదు.

వారికి ఏకైక కూతురు - కావేరి.  ఇంటర్ కంప్లీట్ అయి ఇంట్లోనే ఉండేది.  తండ్రి దగ్గర  గారాబం ఎక్కువ.  తల్లి సాధింపు లెక్కువ. మా ఆవిడ తో ఇట్టే కలిసిపోయింది.  మాటల్తో పాటు కుట్లు, అల్లికలు నేర్చుకుంటూ మా ఇంట్లోనే ఎక్కువసేపు గడిపేది.

మరో  ఆరు నెలల్లో వెంకటగిరి లో ఏదో   కోర్స్ లో చేరింది.  హాస్టల్లో ఉంటూ వారానికి ఒక సారి వచ్చిపోయేది.

వచ్చినపుడు కాలేజ్ కబుర్లు చెప్పి నవ్విస్తూ ఉండేదట. మెల్లమెల్లగా వాళ్ళ కాలేజ్ లెక్చరర్ ఒకడు ప్రపోజ్ చేశాడని చెప్పుకొచ్చిందట. మా ఆవిడికి ఇదంతా ఇష్టముండేది కాదు. అదే విషయం ఆ అమ్మాయితో చెప్పి తల్లితండ్రులకు తలవంపులు తెచ్చే పని చేయొద్దని వార్నింగిచ్చిందట. వెళ్ళింది చదువు కోసమని ప్రేమ కోసం కాదని, జీవితాన్ని నాశనం చేసుకోవద్దని, బుద్దిగా చదువుకోమని చాల సార్లు చెప్పి చూసింది.

ప్రేమనేది పుట్టకూడదు కాని పుట్టిందంటే అది ఎవరి మాటా వినదు. మంచి మాట, మంచి సలహా పట్టించుకోదు. అంతవరకు ఆప్తులుగా ఉన్న వారు ఒక్కసారిగా శత్రువులైపోతారు. అందుకే ప్రేమ గుడ్డిదంటారేమో!

మా ఆవిడ చెప్పి చూసి ఇక ఆ అమ్మాయిని దూరం పెట్టడం మొదలెట్టింది. వచ్చినా ఒకటి రెండు మాటలు చెప్పి పంపించేసేది. క్రమ క్రమంగా ఆ అమ్మాయి కూడా వారం వారం కాకుండా నెలకో, రెండు నెలలకో రావడం మొదలెట్టింది. పాఠాలు కాకుండా ప్రేమ పాఠాలలో చాలా వరకు ముందుకెళ్ళినట్లు అర్ధమవుతోంది.

హఠాత్తుగా ఈరోజు మధ్యాహ్నం జరిగిన సంభాషణ మా ఆవిడ్ని ఒక కుదుపు కుదిపేసింది.

"మేమిద్దరం వచ్చే వారం తిరుపతిలో పెళ్ళి చేసుకోబోతున్నాం ఆంటీ! బహుశా మనం కలవడం ఇదే ఆఖరి సారి కావచ్చు ఎందుకంటే మా ఇంట్లో ఎవరికీ తెలియదు. తెలిస్తే వెళ్ళనివ్వరు."

"కావేరీ! ఆలోచించు. జీవితం నాశనం చేసుకోవద్దు. తొందరపాటు నిర్ణయాలు వద్దు. ఈ వయసులో ఇది ప్రేమ కాదు. ఇంఫాచుయేషన్. ఆ రెండింటికి తేడా ఈ వయసులో నీ కర్ధం కాదు. నీవిపుడు ప్రేమ మైకంలో ఉన్నావు. మైకం దిగగానే వాస్తవాలు కఠినంగా ఉంటాయి. జీవితం సినిమా కాదు. ప్రేమలు సినిమాల్లో సక్సెస్ ఐనట్లు జీవితాల్లో కాదు. జీవితం చేయి జారిన తర్వాత ఆడపిల్లకు భవిష్యత్ ఉండదు. ఒక్క తప్పటడుగు వెనక్కి తీసుకోలేనంత అగాధం అవుతుంది. రోజూ పేపర్లల్లో ఎన్ని చూడడం లేదు! మా ఫ్రెండ్ జీవితం ఇలా బలి అయింది కాబట్టే నీకింతగా చెబుతున్నాను. నీవు చిన్న పిల్లవు. బుద్దిగా చదువుకో. నీ భవిష్యత్ నీ తల్లితండ్రులు ఆలోచిస్తారు.."

" ఆంటీ! మీరు కూడా అదే చెపుతున్నారు. నాకండగా నిలబడతారనుకున్నాను. కాని అందరిలా మీరు కూడా ...ఇలా మాట్లాడు తారను కోలేదు. మీరంతా ఒకటే. మమ్మల్ని అర్ధం చేసుకోరు. మీరు నా ఆప్తురాలనుకొన్నాను. అందుకే నా విషయాలన్నీ షేర్ చేసుకున్నా. కనీసం మోరల్ సపోర్ట్ ఇస్తారనుకున్నా."

సారీ కావేరీ! ఇలాంటి విషయాల్లో నేను సపోర్ట్ చేయలేను. నీవన్నట్లు మీ ప్రేమే నిజమైతే మీ మీ తల్లిదండ్రులను ఒప్పించండి. అంతేకానీ ఇలా దొంగచాటుగా, స్వంత నిర్ణయాలు తీసుకొని వారికి కడుపు కోత మిగల్చకు. అందులోను నీవు ఒక్కర్తివే అమ్మాయివి. ఎంతో అల్లారుముద్దుగా పెంచారు. నీవేది అడిగినా కాదనకుండా ఇచ్చారు. కనుక ఈ విషయంలో కూడా కాదనక పోవచ్చు..."

'పిచ్చి ఆంటీ! ఎవరైనా ఒప్పుకుంటారా! ఎవ్వరూ ఒప్పుకోరు. మా అమ్మానాన్నలు అస్సలు ఒప్పుకోరు. అందుకే ఇలా చేయాల్సి వస్తుంది." "ఇరవై ఏండ్లు కని పెంచి పెద్ద చేసిన ప్రేమ కన్నా; ఏడాది వయస్సు కూడా లేని 'నీ ప్రేమ ' గొప్పదనుకుంటున్నావా? నీ మంచి చెడ్డలు వారి కంటే నీకే బాగా తెలుసనుకుంటున్నావా?"

"అవునాంటీ! సంవత్సరం క్రితం వరకు ప్రేమంటే ఏంటో నాకు నిజంగా తెలియదు. అతన్ని కలిసిన తర్వాతనే నేనింత వరకు ఏం మిస్సయ్యానో కూడా తెలిసింది. అతనితో నా జీవితం హాయిగా, ఆనందంగా ఉంటుందనుకుంటున్నాను. అనుకునేదేముంది... తప్పకుండా ఉంటుంది. ఆ నమ్మకం నాకుంది. ధట్సాల్ . " ఇక మాట్లాడడానికి ఏమీ లేనట్లు వడివడిగా వెళ్ళిపోయింది.

జరిగింది మననం చేసుకుంటూ, చెప్తూ "పాపం అమాయకపు పిల్లండీ!" ఏడుపు ఒక్కటే తక్కువ మా ఆవిడకు.

"మనం ఏమీ చేయలేమా?" రెట్టించింది మళ్ళీ.

"ఏం చేద్దాం! నీ ప్రయత్నాలన్నీ చేశావుగా! వినలేదంటే మనమేం చేయగలం?" అన్నాన్నేను.

"అదికాదండీ! మా ఫ్రెండ్ అనితది కూడా దాదాపు ఇదే పరిస్థితి. ఎవడో మాయ మాటలు చెప్పేసరికి అదీ ఇలాంటి నిర్ణయమే తీసుకొంది. ఇంట్లో చెప్పాపెట్టకుండా పారిపోయింది. మోజు తీర్చుకొని వాడు పారిపోయాడు. ఈ అమ్మాయి రెంటికి చెడ్డ రేవడయింది. ఇపుడు దాని పరిస్థితి ఏమిటో తెలుసుగా ...అక్కడ ఇక్కడ ఏదో పని చేసుకుంటూ బతుకీడుస్తోంది. పరువు తీసిందని పుట్టింటివాళ్ళు దూరమైనారు. నమ్మినవాడు నట్టేట్లో ముంచేశాడు. అది తల్చుకుంటేనే నాకు బాధేస్తుంది. కావేరి కి అలా జరగకూడదనే నా తాపత్రయం. అదేమో వినడం లేదు. పోనీ వాళ్ళమ్మకు చెబుదామంటే ... ఆమె అసలే మెంటల్. కోపిష్ఠి. పోనీ, వాళ్ళ నాన్నకు చెబితే..... "

"ఆయన మాత్రం ఏం చేస్తాడు?"

"నచ్చ చెబుతాడేమో... ఆయన మాటైనా వింటుందేమో ... లేకుంటే అబ్బాయి బాగోగులు  విచారించి పెళ్ళైనా చేస్తాడేమో  "నీవు చెప్పింది బాగుంది! ఆలోచిద్దాం."

ఆలోచనలు, తర్జనభర్జనల తర్వాత వాళ్ళ నాన్నకు చెప్పడానికే నిశ్చయించుకున్నాం.   ఆయన మృదుస్వభావి. మాకు  తెలిసిన విషయం ఆయన దృష్టికి  తీసుకుపోవడం సబబనిపించింది. తగిన నిర్ణయం వాళ్ళే తీసుకుంటారు. దీన్లో మనకొచ్చిన నష్టమేమీ లేదు.  ఇపుడు మనసు ఎంతో తేలిక పడింది.

కిందికి దిగి వచ్చాడు రఘురామయ్య.

"ఏం సార్! బాగున్నారా!"  యధావిధిగా పలకరిస్తూవచ్చి సోఫాలో కూర్చున్నాడు.

ఆ మాటా, ఈ మాటా అయిన తర్వాత అసలు విషయానికొచ్చాను.

"మీరేమీ అనుకోనంటే మీతో ఒక విషయం చెప్పాలి." అన్నాను.

"చెప్పండి సార్! అనుకోవడానికేముంటుంది"

"ఏమీ లేదు.  మీతో ఎలా చెప్పాలో అర్థం కావడం లేదు. చెబితే మీరేమనుకుంటారో అని భయం కూడా ఉంది."

"భలే వారే ...చెప్పండి ...  ఫర్వాలేదు. మీరు మా శ్రేయోభిలాషులు. ఏం చెప్పినా వింటాను."

"మాపైన ఆ నమ్మకం ఉంది కాబట్టే విషయం చెప్పాలా వద్దా అని కూడా తర్జనభర్జన పడాల్సిన పరిస్థితి ...తీరా విన్న తర్వాత మీరెలా ఫీలవుతారో నని..."

"ఏం ఫర్వాలేదు. ఆలోచించకుండా చెప్పండి."

"ఒక విషయం మా దృష్టికి వచ్చింది. కావేరి ..."

"కావేరి కేమయింది"

"ఆవేశపడకండి. కావేరి వాళ్ళ కాలేజ్ లో ఎవర్నో ప్రేమించిందట. పెళ్ళిదాకా వెళ్ళిందని మా చెవిలో పడింది."

"నిజమా?"

"తొందర పడకండి. మీరొక సారి కాలేజ్ కి వెళ్ళి విచారించండి. ఎంతవరకు నిజమో తెలుసుకోండి.ఆ తర్వాత తగు నిర్ణయం తీసుకోండి." "ఇది నిజమా? మీకెలా తెలిసింది."

"కావేరే స్వయంగా మా ఆవిడతో చెప్పిందట. మీరు ఆవేశపడకండి. తొందరపడకండి. ఇది చాలా సున్నితమైన విషయం. సున్నితంగా డీల్ చేయాల్సిన విషయం. ఇది మీకు చెప్పడం భావ్యమవునో కాదో తెలియదు. కానీ మీ శ్రేయోభిలాషులుగా మాకు తెలిసిన విషయం మీకు చెప్పడం సబబని పించింది. ఇందులో నా సహాయం ఏదైనా అవసరమైతే మొహమాట పడకండి. "

ఆయన షాక్ అయినట్లు ఫీల్ అయ్యాడు. దీర్ఘాలోచనలో పడ్డాడు. అనేక వేల ప్రశ్నలు ఆయన మెదడులో సుడులు తిరుగుతున్నాయని మాత్రం తెలుస్తోంది.

"మాష్టారూ! మిమ్మల్ని బాధ పెట్టామనిపిస్తోంది. ఏమనుకోకండి. అది విన్నప్పటి నుంచి మా పరిస్థితి కూడా అలాగే

ఉంది. మీరు మంచివారు. మీకు చెప్పడం మంచో చెడ్డో కూడా తెలియదు. ఎందుకో ఆ విషయాన్ని మీ చెవిలో వేయాలనిపించింది. వేశాం. తప్పయితే క్షమించండి."

"నో...నో. చాలా మంచి పని చేశారు. చాలా థాంక్స్. మీరన్నట్లు కాలేజ్ కి వెళ్ళి విచారిస్తాను. తర్వాత ఏం చేయాలో ఆలోచిస్తాం" అంటూ మెల్లగా లేచి వెళ్ళిపోయాడు.

ఉదయం మా ఇంటిముందు ఏదో అరుపులు వినిపించి తలుపు తీశాం. ఎదురుగా అపర కాళికావతారంలో - అనసూయమ్మ. అరుపులు;కేకలతో పెద్ద రణరంగమే అయింది. ఆమె మమ్మల్నే టార్గెట్ చేసిందని తెలియడానికి ఐదు నిమిషాలు పట్టింది. ఇది మేం ఏమాత్రం ఊహించనిది. వాళ్ళ అమ్మాయి చాలా మంచిదట. మేమే నడి వీధిలో పెట్టాలని అభాండాలు వేశామని, దాని బతుకు బజారు కీడ్చామని తూర్పార పట్టింది. మాకు తెలిసిన విషయాన్ని మూడో కంటికి తెలియకుండా రఘురామయ్యకు చెప్పాం. ఆమె బూతుపురాణంతో వీధి వాడా ఏకం చేసింది.

చుట్టుపక్కల వాళ్ళు అప్పుడే చెప్పారు కానీ; ఇంత దారుణంగా ఉంటుందని ఇప్పుడే అనుభవంలోకి వచ్చింది.

చివరికి ఇంటిని వెంటనే ఖాళీ చేయమని అల్టిమేటం ఇచ్చింది.

తల కొట్టేసినట్లయింది. ఇంతవరకు ఇలాంటి అనుభవమే లేదు. మేమేదో ఉపకారం చేయబోయి మా నెత్తికే కుంపటి తెచ్చుకొన్నట్లయింది. ఎవరెలా పోతే మనకేమని ఉండవలసింది ...ఉండలేకపోయాం. ఇందుకే అంటారేమో తనకు మాలిన ధర్మం పనికిరాదని. ఇపుడు వగచి ప్రయోజనమేమిటి? ఈ బుద్ధి అప్పుడే ఉండవలసింది.

అవమానంగా ఉంది. ఈ విషయం అయనతో చెప్పి తప్పు చేశామేమో అన్న ఫీలింగ్.

"ఆమె మెంటాలిటే అలాంటిది సార్! అందుకే ఆ ఇంట్లో ఎవరూ ఆర్నెళ్ళకు మించి లేదు." - వీధిలో వాళ్ళూ; కొలిగ్స్ ఓదార్చారు.

ఇంతజరిగినా రఘురామయ్య జాడ లేదు. పాపం! ఆయన భార్య చాటు భర్త. ఆమె నోటి ముందు ఆయన మాత్రం ఏమి

చేయగలడు.    "ఇంత జరిగాక ఆ ఇల్లు వద్దనే వద్దు... ఖాళీ చేసేద్దాం సార్!..."   అని మావాళ్ళు ఆవేశపడ్డారు.

ఆవేశమే కాదు పట్టుపట్టి సాయంత్రాని కల్లా ఇల్లు ఖాళీ చేయించేశారు.

ఆ తర్వాతెప్పుడో "ఆ అమ్మాయి అన్నంత పని చేసిందనీ ...వాళ్ళ తిక్క కుదిరిందనీ " ఎవరో చెప్పారు.

ఐదారు నెలల్లోనే నాకు హైదరాబాద్ ట్రాన్స్ఫర్ై వెళ్ళిపోయాను.

నాలుగేళ్ళ తర్వాత నాకు ప్రమోషన్ వచ్చి  వెంకటగిరికి బ్యాంక్ మేనేజర్ గా పోస్ట్ చేశారు.

"సార్ ఈరోజు 'రాజీవ్ యువ శక్తి' ఇంటర్వ్యూస్ ఉన్నాయి మనం వెళ్ళాలి " గుర్తుచేశాడు మా ఫీల్డ్ ఆఫీసర్.

'రాజీవ్ యువ శక్తి" పథకం ద్వారా   నిరుద్యోగ యువతకు స్వంత వ్యాపారాలు చేసుకోవడానికి సబ్సిడీతో పాటు బ్యాంక్ లోన్ ఇస్తారు. అందుకు అభ్యర్థులను ఇంటర్వ్యూల ద్వారా సెలెక్ట్ చేస్తారు.

ఇంటర్వ్యూలు జరుగుతున్నాయి.

చివరి అభ్యర్థిని  కావేరి ని  పిలిచాడు   ఫీవన్.

'నమస్కారం సార్ ' అంటూ కావేరి లోపలికొచ్చింది.

"నమస్తే సార్" ప్రత్యేకించి నాకు మరోసారి చెప్పింది.

"కావేరి అంటే...."

"అవును సార్!  ఆ కావేరే ... ఈ కావేరి.  నాలుగేళ్ళ క్రితం మీరు మా ఇంట్లో అద్దెకు ఉండేవారు. గుర్తుందా?"

"గుర్తుకు రాకుండా ఎలా ఉంటుంది.  జీవితంలో ఎదురైన ఘోర అవమానం అంత సులభంగా ఎలా మర్చిపోగలను."


'మీ ఆవేశంలో అర్థం ఉంది.  మేడం గారు ఎంత చెప్పినా నా చెవికెక్కలేదు. మంచి మాటలు రుచించలేదు. ప్రేమ ప్రేమ అని నమ్మి ఎవర్ని లెక్క చేయకుండా వచ్చేశాను. సంవత్సరం వరకు చాలా చాలా హ్యాపీగా  గడిచింది. స్వర్గం అంటే ఇదేనేమో అన్నంత హాయిగా క్షణాల్లాగడిచిపోయింది. ప్రపంచంలో మేమిద్దరమే ఉన్నట్లు మరెవరితోనూ సంబంధం లేనట్లుగడిపాం. అందర్నీ ఎదిరించి నేనెంతో మంచి పని చేశానని పొంగిపోయాను.  ఆ ఆనందం ఎగిరి పోవడానికి ఎంతో కాలం పట్టలేదు.  పాప పుట్టాక అతని అసలు రంగు ఒకటొకటిగా బయట పడసాగింది.  ముఖం చాటేశాడు. క్రమంగా ఇంటికి రావడం తగ్గించేశాడు. నిలదీశాను. అసలు విషయం తెలిసింది.  మేనమామ కూతుర్ని పెళ్ళి చేసుకున్నాడట. తప్పనిసరి పరిస్థితుల్లో తల్లితండ్రుల కోసం చేసుకోవలసి వచ్చిందట. నీకన్యాయం చేయనన్నాడు.   నాకు జరిగిన అన్యాయాన్ని  ఎదిరించాను. వాళ్ళింటి ముందు మౌనపోరాటం చేశాను. మహిళా సంఘాలు, పత్రికలు, టీ వీ ఛానెల్స్ నాలుగు రోజులు అండగా  నిలిచాయి. ఆ తర్వాత పట్టించుకోవడం మానేశాయి. వాళ్ళే కాదు నమ్ముకొని వచ్చిన వాడు కూడా నన్ను పట్టించుకోవడం పూర్తిగా మానేశాడు.  రాను రాను ఇల్లుగడవడం కష్టంగా మారింది. పసిపాపతో పుట్టింటికెళ్ళాను.  అపుడు తెలిసింది నా మీద దిగులుతో మా నాన్న పోయి రెండేళ్ళయిందని. మా అమ్మ పిచ్చిదయింది. పిచ్చి ముదిరి ఏం చేస్తుందో  ఆమెకే తెలియడం లేదు. మీద పడి రక్కినంత పని చేసింది. "నీ ముఖం మళ్ళీ చూపించకు వెళ్ళి పో" ముఖం పైన్నే తలుపేసుకుంది.  ఎవర్నని ఏం లాభం ...నాకిది కావల్సిందే. చేతులారా చేసుకున్నందుకు అనుభవించక తప్పదు! ఇక గత్యంతరం లేక ఒక బట్టల షాప్ లో సేల్స్ వుమెన్ గా ఇలా బతుకీడు స్తున్నా ."  "మేడం దయవల్లకుట్లు అల్లికలు నేర్చుకున్నాను.   నా కాళ్ళపై నేను నిలబడాలనుకుంటున్నాను.  మీరు దయ తలచి లోన్ ఇప్పిస్తేనాకో దారి చూపినవారవుతారు.  రెండేళ్ళుగా ఇంటర్వ్యూలకు వస్తున్నాను. కానీ ఇంతవరకు ఎవరూ  కరుణించలేదు.  నాకు  రెకమేండేషన్స్ లేవు.  డబ్బులు ఇచ్చుకోలేను. దయ చేసి మీరైనా కరుణించండి. " అంటూ కాళ్ళపై పడబోయింది.

"పాపం! ఎలాంటి అమ్మాయి...ఎలాంటి దుస్థితి కొచ్చింది."  జాలేసింది. వాళ్ళ  నాన్న గుర్తొచ్చి బాధేసింది. ఆ అమ్మాయిని ఈ స్థితిలొ చూడాల్సి వస్తుందనుకోలేదు.    సహాయం చేయాలనిపిస్తోంది.

'యస్ కావేరి! యూ  ఆర్ సెలెక్టెడ్. నీకీ లోన్ ఇస్తున్నాను.  నీ కాళ్ళపై నిలబడి సొసైటీ లో తలెత్తుకొని బతకాలి. ఆల్ ద

బెస్ట్" అన్నాను దృఢంగా ఆమె ఊహించలేదేమో ఆనందంతో ఉక్కిరి బిక్కిరవుతూ, "చాలా చాలా థాంక్స్ సార్! ఇంకా లోకంలో మంచితనం మిగిలే ఉంది సార్! మీలాంటి వారింకా ఉన్నారు. మీ మేలు జన్మలో మరిచిపోను సార్! " ఆనందబాష్పాలు రాలిపోగా రెండు చేతులు జోడించి నమస్క రించింది. "యస్ తలెత్తుకొని తిరుగుతాను సార్! అంతే కాదు ... ప్రేమ, పెళ్ళి, దగా, మోసం, దోపిడీలు, మానభంగాలు, మౌన పోరాటాలు --వీటివల్ల దగా పడి నాలాగా జీవితాల్ని నాశనం చేసుకుంటున్న ఆడపిల్లల్ని అప్రమత్తం చేయాలనుంది. పేపర్లలో రోజూ వస్తున్న ఇలాటి వార్తలను చూస్తూకూడా మళ్ళీ మళ్ళీ బలయిపోతున్న అభాగ్యుల్ని జాగృతం చేయాలనుంది. పేపర్లలో ఆ పదాలే రాని రోజు రావాలనుంది." పిడికిలి బిగించి కావేరి ముందుకు కదిలింది.

నిజంగా పేపర్లలో అలాంటి వార్తలు లేని రోజు వస్తుందా? ఏమో! కాలమే చెప్పాలి.




"ఏరా ఈ మధ్య కథలేమన్నా రాసావా?"

"ఆఁ"

"దేనికి పంపుతున్నావు? కొత్తపత్రిక "తీయ తేనియ తెలుగు"కి పంపించకపోయావా? వాళ్ళు కథలో..రాయడంలో కొత్తదనం వుంటే బాగా ప్రోత్సహిస్తున్నారు."

"దానికా? అది పారితోషికం ఇవ్వదు. నేనూ అప్పట్లో ఒక కథ పంపాను..కథ ప్రచురించారే కాని పారితోషికం ఇవ్వలేదు. అసలు మన తెలుగు పత్రికల్లోరెమ్యూనరేషన్ ఇచ్చి ప్రోత్సహించేవి ఎన్ని వున్నాయి(వ్యంగ్యంగా)? నిజం చెప్పాలంటే అసలు మన కథ ప్రచురణకు స్వీకరించిన విషయం గాని..అచ్చయిన విషయం తెలుపుతూ కాంప్లిమెంటరీ కాపీ పంపడంగాని చేస్తారా? ఒకవేళ పంపినా అదీ మొక్కుబడిగానే! అది మనకి అందిందా? లేదా? అన్నది వాళ్ళకి అనవసరం. అదీ రచయితల పట్లవాళ్ళు వ్యక్తపరిచే గౌరవం(మళ్ళీ వ్యంగ్యంగా). అవునులే కవులనీ..రచయితల్ని తగు రీతిన సత్కరించి ఆదరించడానికి ఇదేమైనా శ్రీకృష్ణదేవరాయల రాజ్యమా? ఏదో రాయాలని రాయడమే కానీ నిజంగా పారితోషికాల ఆధారపడితే మనగతి అధోగతే!"అని నిట్టూర్చాడు.

"ఒరే నేనో మాట చెప్పనా! రాయడమన్నది మనకి ఆ చదువులతల్లిపెట్టిన భిక్ష. 'కళ కళకోసమే కాని కాసు కోసం కాదు' అన్నది నీకు తెలిసే వుంటుంది. మనసులో చోటుచేసుకునే ఊహల్ని అక్షరాల్లోపేర్చడమన్నది అందరికీ సాధ్యం కాదు. మనం రాసేది కొన్ని జీవితాల్లోమార్పుతేవచ్చు..కొంతమందికి వెలుగు దారి చూపించవచ్చు. సమాజ హితం కోరేవాడే కవి.. రచయిత! అందుకే వాళ్ళకీ వాళ్ళ రచనలకీ అభిమానులుంటారు. అక్షరం అంటే నాశనం లేనిది. వాటితో మన ఆలోచనలకి రూపమిస్తాం కాబట్టే అవి నశించవు. మనం రచయితల మవ్వడమన్నది పూర్వజన్మ సుకృతం.


ఇహ పారితోషికం విషయం! వేదిక మీద నృత్యం చేయబోయే కళాకారుడి దృష్టి చప్పట్లమీద వుంటే..అది అతడి మానసిక అపరిపక్వతని తెలియజేస్తుంది. సృజనాత్మకతకి ఎల్లలుండకూడదు. కాసులకీ..కానుకలకీ లోబడకూడదు. నా వరకూ నాకు పత్రికలన్నీ నా లోని రచయిత కి వేదికలే. నా సాహితీ విశ్వరూపానికి ప్రత్యక్షసాక్షులే! అందులో ఎటువంటి తారతమ్యాలుండవు. నా కథకి పారితోషికం వస్తేఆనంది స్తాను..రాకపోయినా సంతోషిస్తాను. నాక్కావలసింది నా రచన ప్రచురించబడడానికి ఇంత చోటు. అది కల్పించే ఏ పత్రికయినా నాకు సాక్షాత్తూ ఆ చదువులతల్లితో సమానం." నా మనసులో వున్నది వెళ్ళగక్కేసాక మనసుకి ఎంతో తృప్తిగా వుంది.

"సార్! మీరిక్కడున్నారా? మీ కోసం వచ్చిన ఉత్తరాల బరువుతో ఇందాకణ్ణుంచి మిమ్మల్ని వెతకలేక చస్తున్నాననుకోండి.. మీకు స్వయం గా నా చేతులతో ఉత్తరాలిస్తేతప్ప మనశ్శాంతి వుండదు. ఇదిగోండి"అంటూ నా చేతిలో ఉత్తరాల కట్టపెట్టాడు పోస్ట్ మెన్."చూడరా! ఇవన్నీ "తీయ తేనియ తెలుగు" లో పడిన నా కథకి వచ్చిన

స్పందన. డబ్బుతో దీనికి విలువ కట్టగలమా చెప్పు? ఆఁ.. అన్నట్టు ఇదిగో చూడు..నా కథ ఎంతగానో నచ్చి వచ్చే నెల్లో ఒంగోల్లోనాకు సన్మానం చేస్తార్టట. అంగీకారం తెలియజేయమని ఉత్తర్తం రాసారు. చూశావా! నీ దృష్టిలో పారితోషికం పంపని ఆ పత్రికకి విలువలేదు..కానీ అదే నా విలువని ఎంత పెంచిందో? పత్రికని నడపడం అంత సులువుకాదు..దాని వెనక అభిరుచితో పాటు చాలా ఒడిదుడుకులుంటాయి. మనలాంటి వాళ్ళు పత్రికల్ని బ్రతికిస్తే అవి ఊపిరిపోసుకుని మనలాంటి అనేకమంది రచయితలకి..కవులకి..చిత్రకారులకీ.. జీవంపోస్తాయి. అయినా రచయితలుగా మనం పత్రికలని అర్థం చేసుకోకపోతే, ఎవరు అర్థం చేసుకుంటారు? నీకు వీలైతే పత్రికల్ని ప్రోత్సహించు..అంతేకాని మన పత్రికల మీద అందరి ముందూ అవాకులూ చెవాకులూ మాట్లాడకు" అన్నాను బాధగా!

వాడు ఉన్నట్టుండి అక్కడ్నుంచి గబ గబా వెళ్ళిపోసాగాడు.

"ఒరే ఎక్కడికిరా? కోపమొచ్చిందా?" అన్నాను అరుస్తూ. "కాదురా! ఇన్నాళ్ళూ తప్పుడు ఆలోచనతో చీకట్లో వున్నాను..ఇప్పుడే సాటి రచయితగా నా కళ్ళు తెరిపించావు. నేనిప్పుడే నా కథ "తీయ తేనియ తెలుగు"కి పోస్ట్ చే స్తాను. అంతే కాదు ప్రతి పత్రికనీ ప్రోత్సహిస్తాను." మాటల్లో పశ్చాత్తాపాన్ని మిళితంచేస్తూ అన్నాడు.




భీమారం అనే ఒక  గ్రామానికి ఆనుకొని ఒక చిట్టి అడవి ఉంది. ఒకప్పుడు ఇది మహారణ్యమే కాని కాలక్రమేణా మానవుల వంట చెరకుగా చెట్లు బలి అయిపోతూ ప్రస్తుతం చిట్టడివిగా మిగిలి పోయింది.

ఈ అడవిలో ఒక ఎలుగుబంటి ఉంది. దానికి ఆహారం పెద్ద సమస్యగా మారింది. పండ్లు  కందమూలాలు చిట్టడవిలో సమృద్ధిగా లభించేవి కావు.  'ఆహార సమస్యను  పరిష్కరించుకోవడం ఎలాగా..?' అని మనసులో మదనపడ సాగింది..

ఒక రోజు మృదంగం వాయిస్తూ నృత్యం చేస్తూ ఊరూరా అడుక్కుతినే ఒక బిచ్చగాడు ఆ అడవిగుండా వెళ్తుంటే వానిపై పడింది. తనకు కావాల్సిన ఆహారమేదైనా దొరుకుతుందేమోనని ఆశగా వెదికింది. వాని బొచ్చెలో  అన్నం, వివిధ రకాల కూరలు, పచ్చళ్ళూ, పప్పు, పులుసు కనిపించే సరికి రుచి చూసింది. ఆవురావురు అంటూ మొత్తం తినే సింది.  వాడి సంచిలో ఉన్న సొరకాయ బుర్రలోని నీళ్లన్నీ తాగింది.

వాని దగ్గర ఉన్న మృదంగం లాక్కొని అందులో ఇంకా ఏమైనా తిను భండారాలు ఉన్నాయేమోనని కొట్టి చూసింది. మృదంగం నుండి వచ్చిన శబ్దం దానికి విచిత్రంగా వినపడింది. ఆ శబ్దం వినపడగానే అలవాటు ప్రకారం ఆ బిచ్చగాని కాళ్ళు నృత్యభంగిమలోకి మారాయి. ఎలుగుబంటికి నవ్వు వచ్చింది. అది అలాగే వాయిస్తూపోయింది. వాడు భయం భయంగా నృత్యం చేయసాగాడు. మధ్య మధ్యలో ఎలుగుబంటి వాని మీద పడబోతున్నట్లునటిస్తూ మరింత భయపెట్టసాగింది. వాని ముఖంలోని భయం చూసి సంబర పడసాగింది. వాడు రెండు చేతులా దండం పెడ్తూ కన్నీరు కార్చ సాగాడు. ఎలుగుబంటికి జాలి వేసింది.. ఇంతలో తన బుర్రలో ఒక ఆలోచన మెరిసింది. ఆ గ్రామ ప్రజలు పట్టణానికి వెళ్ళాలంటే ఈ అడవిగుండా ప్రయాణించక తప్పదని ఎలుగుబంటికి తెలుసు. ఒకవేళ అది ఊళ్ళోకి వెళ్ళితే అంతా కలిసి కట్టుగా చంపేస్తారననే భయం కూడా లేక పోలేదు అందుకే అది ఒక ఉపాయం పన్నింది.

బిచ్చగానితో "ఇక వెళ్ళు.. వెళ్ళి గ్రామంలో ఉన్న ప్రజలందరికీ చెప్పు. ఈ అడవి గుండా వెళ్ళే వారెవరైనా క్షేమంగా ప్రయాణించాలనుకుంటే నాకోసం ఇలాంటి ఆహారం తీసుకు రావాలి. లేదా వారి రక్తం తాగుతాను.." అంటూ ఉరిమి చూసింది. బిచ్చగాడు బతుకు జీవుడా అంటూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని కాలికి బుద్ధి చెప్పాడు.

ఈ విషయం భీమారం ఊళ్ళోని పెద్ద మనుషులకు చెప్పి రోదించాడు బిచ్చగాడు. ఆ గ్రామ పెద్ద ఎలుగుబంటికి ఆహారం తీసుకు వెళ్ళే నియమాన్ని ఊళ్ళో దండోరా వేయించాడు.

భీమారం ప్రజలు ఎలుగుబంటి కోసం అన్నపానీయాలు సమర్పించుకోవటం పరిపాటి అయిపోయింది. అలా ఎలుగుబంటికి అన్న పానీయాలకు అలవాటు పడి కడుపు నింపుకోసాగింది. ఒకవేళ ఎవరైనా ఒట్టి చేతులతో వెళ్ళితే మరణమృదంగం వాయిస్తూ నృత్యం చేయించేది. వారు ప్రాణ భీతితో మారిన ముఖ కవళికలను చూస్తూ సంబరపడేది. వారి నృత్యంలో పైశాచిక ఆనందం పొందేది. ఒక్కొక్క సారి నృత్యం చేస్తూ అలిసి పోయి చనిపోయిన వారూ ఉన్నారు. అప్పటి నుండి జనమంతా దాని చేతిలోని మృదంగాన్ని 'మరణ మృదంగం' అనే వారు.

ఆ చిట్టి అడవిలో మరే ఇతర క్రూర జంతువులు లేనందున దాని ఆగడాలు మితిమీరిపోయాయి. తనే ఆ అడవికి మహారాజుననే గర్వం దాని ముఖంలో తొణికిసలాడేది.

ఎలుగుబంటికి క్రమేణా ఇదొకరకమైన సరదాగా మారింది. అది మృదంగం వాయిస్తూ. ఒక పెద్ద బావిలోకి తొంగి చూస్తూ జనం పడే మరణ వేదన హావ భావాలను అనుకరిస్తూ సంబర పడేది. ప్రాణం పోతుందంటే అంత భయ పడాలా? అని నిర్లక్ష్యంగా నవ్వుకునేది. మనుషులకు ప్రాణం మీద ఎందుకో అంత తీపి?.. అని పరిహసించేది. తను ప్రజల్లో కలిగించిన భయాన్ని తలుచుకుంటూ గర్వపడేది.

అదే గ్రామంలో ఆండాళు అనే వృద్ధురాలు నివసించేది. ఆమెకు తోడూ నీడా సర్వస్వం ఆమె మనుమడే.. పేరు కరుణాకరుడు.

ఆండాళు అరిసెలు, గారెలు మొదలగు తిను భండారాలు చేయడంలో దిట్ట.

కరుణాకరుడికి అమ్మమ్మ అంటే పంచప్రాణాలు. ఆమె పనుల్లో చేదోడు వాదోడుగా ఉండే వాడు. ప్రతీ రోజూ తెల్లవారు ఝామున్నే లేచి అడవికి వెళ్లి కట్టెలు తెచ్చేవాడు. అవి రాగానే అరిసెలు చేయడం మొదలు పెట్టేది ఆండాళు. సాయంత్రానికల్లా అరిసెలు చేయడం.. అమ్మడం పూర్తయ్యేది. ఆతరువాత అరిసెలకు కావాల్సిన ముడి సరకులు కొనుక్కొని వచ్చే వాడు కరుణాకరుడు. ఇదీ వారి నిత్యకృత్యం.

ఒక రోజు యథావిధిగా కరుణాకరుడు అడవికి వెళ్లాడు. ఎలుగుబంటి కోసం సద్ది మూట తేవడం మర్చి పోయాడు. ఎలుగుబంటికి విపరీతమైన కోపం వచ్చింది. జూలు విదిల్చి బిగ్గరగా అరిచింది. దాని కోపం చూడగానే కరుణాకరుడు 'ఇక నాకు చావు తప్పదు' అని గజ గజ వణుకసాగాడు. అది గమనించిన ఎలుగుబంటికి పాపమనిపించింది. అయితే తన మనసులోని సందేహాన్ని నివృతి చేసుకోవాలని "మనుషులకు ప్రాణాల మీద అంత తీపి ఎందుకు?" అంటూ అడిగింది. ఎలుగుబంటి మాటల్లోపడేసరికి కరుణాకరుడికి కాస్తా ధైర్యం వచ్చింది. దాని ప్రశ్నకు సమాధానం చెప్పడం కాదు.. స్వయంగా అది అనుభవించేలా చేయాలని మనసులో అనుకున్నాడు. మాట మార్చాడు..

"మా అమ్మమ్మ ఆండాళు అరిసెలు చేయడంలో అందె వేసిన చేయి. ఆమె అరిసెల వాసన ఆమడ దూరం అదరగొడ్తుంది. కమ్మని తియ్యని ఆ వాసన ఆస్వాదించాలే గాని చెప్పనలవి కాదు. కట్టెలు తీసుకొని వెళ్లి అరిసెలు చేయించుకొని నీకోసం సాయంత్రం తిరిగి వద్దామని అనుకున్నాను. అందుకే ఈ పూట ఏమీ తేలేదు" అన్నాడు.

కొత్తరకం వంటకం పేరు వినరావడంతో భోజన ప్రియమైన ఎలుగుబంటి తన ప్రశ్నకు సమాధానం కోసం వేచి చూడకుండా "అయితే తొందరగా వెళ్ళు.. సాయంత్రం తప్పకుండా రావాలి సుమా..! నాకు నోరు ఊరిపోతోంది.." అంటూ లొట్టలు వేయసాగింది.

కరుణాకరుడు కట్టెలు కొట్టుకొని ఇంటికి వచ్చాడు..

ఆండాళు అరిసెలు చేస్తుండగా మెల్లిగా అడవిలో జరిగిన విషయం చెప్పాడు. ఆండాళు ఒక చక్కని ఉపాయం చెప్పింది. అందుకే అంటారు..'ముసలి వాళ్లు ఇంట్లో ఉంటే వారి అనుభవాలతో ఎంతటి అపాయాన్ని అయినా ఉపాయంతో తప్పించుకోవచ్చు' అని. ఎలుగుబంటి సాయంత్రం ఎప్పుడు అవుతుందా, కరుణాకరుడు ఎప్పుడు వస్తాడా, ఎప్పుడు అరిసెలు తింటానా... అని ఎదురు చూడసాగింది...

సాయంత్రం అయ్యింది.. సూర్యుడు అస్తమించాడు. క్రమేణా చీకట్లు కమ్ముకో సాగాయి.. రాత్రి కావస్తోంది.. కరుణాకరుని జాడ లేదు. ఎలుగుబంటికి ఒక పక్క కడుపులో ఎలుకలు పరుగెత్తుతుంటే కోపం విజృంబించ సాగింది. 'ఇక లాభం లేదు కరుణాకరుడు మోసం చేశాడు. మరునాడు కూడా వస్తాడన్న ఆశ లేదు.. కనుక నేనే వెళ్లివాని అంతు చూస్తాను..' అని మనసులో అనుకుంటూ గ్రామంలో ప్రవేశించింది. ఊళ్లో అడుగు పెట్టగానే ఎన్నడూ ఆస్వాదించని కమ్మని తియ్యని వాసనలు తన ముక్కుపుటాలను తాకే సరికి ఒళ్లు పులకరించి పోయింది. 'కరుణాకరుడి ఇల్లు దొరకడం చాలా తేలిక..' అని మనసులో సంబరపడుతూ వాసన వెంట పరుగులు తీసింది.

ఊరంతా గాఢ నిద్రలో ఉంది. ఎలుగుబంటి నెమ్మదిగా ఆండాళు ఇంట్లోకి ప్రవేశించింది. కరుణాకరుడు నులక మంచంలో పడుకొని ఉన్నాడు. అరిసెలు ఎలా ఉంటాయో తెలియక తిక మక పడింది. ఎంత వెతికినా ఆ వాసన కల్గిన పాత్రలన్నీ ఖాళీగా కనిపించాయి. అలికిడి అయితే అంతా లేచి తన పని పడతారని అనుమానం వేసింది. ఎటూ పాలుపోని పరిస్థితి.. కోపంతో కరుణాకరుడు పడుకున్న మంచాన్ని అమాంతం తన వీపు మీదకు ఎత్తుకొని అడవిలోకి పరుగు తీసింది. ఇది గమనించి వసారాలో పడుకున్న ఆండాళు మనుమనికి తాము పన్నిన ఉపాయాన్ని సైగలతో గుర్తుచేసింది.


కరుణాకరుడు నెమ్మదిగా ఎలుగుబంటి వెండ్రుకలను నులకకు ముళ్లువేస్తూపోయాడు. ఎలుగుబంటి నేరుగా అడవిలో రోజూ తన ముఖాన్ని నీళ్ళల్లోచూస్తూసంబరపడే బావి వద్దకు వచ్చింది. బలాన్నంతా పుంజుకొని మంచాన్ని బావిలోకి విసిరేసింది. అప్పటికే బావి గోడలపై వేళ్ళాడే మర్రి చెట్టు ఊడలను పట్టుకొని కరుణాకరుడు తప్పించుకున్నాడు. ఎలుగుబంటి మంచంతో సహా బావిలో పడిపోయింది. ఈ హఠాత్పరిణామానికి ఎలుగుబంటి భయంతో కంపించి పోయింది. నీళ్లలో మునుగుతూ ఇక చావు తప్పదు అనే ఆలోచన మదిలో రాగానే.. చావు అంటే ఎంత భయంకరమో! దానికి తెలిసి వచ్చింది. వెన్నెల వెలుగులో బావి నీళ్లలో తన మరణ భీతి ముఖాన్ని చూసి కన్నీరు కార్చసాగింది. తన చెవులలో మరణ మృదంగం అవహేళనగా మ్రోగుతున్నట్లు అనుభూతికి లోనయ్యింది.

'మనుషులకయినా జంతువులకయినా ప్రాణము ఒకటే.. దానిని కాపాడుకోవాలే గాని ఒకరి ప్రాణాలు తీయవద్దు.. భగవంతుడా నన్ను క్షమించు..' అంటూ భగవన్నామస్మరణ చేయసాగింది.

కరుణాకరునికి పాపమనిపించింది. వన్య మృగాలను సంరక్షించుకోవాలే కాని  సంహరించడం మహా నేరం అనుకున్నాడు..

సాహసించి మర్రి ఊడల సహాయంతో బావి అంచుల గుండా వెళ్లి మంచానికి కొన్ని లేత ఊడలను ఒడిసి కట్టాడు. మళ్ళీ పైకి వచ్చి తన ప్రాణాలకు తెగించి అత్యంత నైపుణ్యంతో ఎలుగుబంటిని కాపాడాడు.

ఎలుగుబంటి వెనుక కాళ్లపై నిలబడి ముందు కాళ్లతో దండం పెట్టింది. ఇక ముందు ఎవరి జోలికీ వెళ్లనని దట్టమైన అడవిలోనికి వెళ్ళి దొరికిన కందమూలాలు తింటూ జీవనం గడుపుతానని ప్రమాణం చేసింది.




ఎంత వద్దనుకున్నా పక్కింటి పిన్ని గారి మాటలు పదే పదే గుర్తుకు వస్తూ మనశ్శాంతి లేకుండా చేస్తున్నాయి వనజను. " ప్రతీ పండక్కి నీ ఆడపడుచు భర్తా పిల్లల్లతో సహా వచ్చి పది రోజులకు పైగా వుండి వెళ్తూంటే నువ్వు పాపం అమాయకత్వంతో ఊర్కుంటున్నావు కాని ఈ రోజుల్లో ఎవరూ నీలాగా భర్తింటి బంధువులను భరించట్లేదమ్మాయ్..

ఎందుకు చెబుతున్నానో కాస్త అర్థం చేసుకో " అని ఆవిడ చెప్పిన ప్పట్నుంచీ ఎలాగైనా ఈసారి పండుగ సెలవులకు కుటుంబంతో సహా వచ్చే ఆడపడుచు లావణ్యను రానీయకుండా కట్టడి చేయాలని ఆలోచిం చింది వనజ. తన ఆలోచనలో తనుండగానే సెల్ ఫోన్ రింగయ్యింది. చూస్తే ఇంకెవరు..ఆడపడుచు లావణ్య దగ్గర్నుంచే... ఎప్పటి లానే పండుగ సెలవులకు అందరం వస్తున్నామని రిజర్వేషన్ కూడా చేయించేసుకున్నామని ఆ ఫోన్ సారాంశం.. అప్పటికప్పుడు ఏ సాకూ చెప్పటానికి వీలులేక సరే అని ఎలా వున్నారందరూ అంటూ ఏదో పొడిగా కుశల ప్రశ్నలు అడిగి ఫోన్ కట్ చేసింది వనజ.

ప్రతీసారీ ఆడపడుచు సెలవుల్లో భర్త, పిల్లలతో కల్సి రావటమూ ఇల్లు గుల్ల చేయటమూ పరిపాటైపోయింది ఇంటెడు చాకిరీ తోపాటు, పిండి వంటలు, అదనపు ఖర్చులు, ఇంటిల్లిపాదికి కొత్తబట్టలు, ఇవేమీ తప్పటం లేదు. ఈసారి తను ఎలాగైనా భర్తతో సంప్రతించి అర్థమొగుడ్ని ఇంటికి రానీయకుండా చేయాలని నిర్ణయించుకున్నాక కాస్త శాంతించిందామె మనసు.

వనజ తల్లిదండ్రులు చిన్నప్పుడే పోవడంతో మేనమామ సం రక్షణలో పెరిగిన ఆమెను వారి దూరపు బంధువు అయిన రామారావు గారి కాళ్ళు పట్టుకుని బ్రతిమిలాడి కాణీ కట్నం లేకుండా వారి అబ్బాయి ఆనంద్ కిచ్చి పెళ్ళి జరిపించి చేతులు దులుపుకున్నాడు వనజ మేనమామ. వనజ తల్లితండ్రుల తాలూకు కాస్త డబ్బూ కాజేసి పెళ్ళి చేసాక కనీసం సంవత్సరంలో ఒకసారి కూడా ఆమెను తీసుకెళ్ళే ప్రయత్నం చేయకుండా పాపం ఏ మాత్రం కూడా పుట్టింటి ఆశ లేకుండా చేశాడు. కానీ వనజ అత్తవారింట అడుగు పెట్టిన వేళా విశేషం వల్ల అప్పటిదాకా ప్రైవేట్ జాబ్ చేసుకుంటున్న ఆనంద్ కు ప్రభుత్వ వుద్యోగం రావటమూ, ఆనంద్ చెల్లెలు లావణ్యకు అన్నివిధాలా అనుకూలమైన మంచి సంబంధం కుదిరి పెళ్ళి కావటంతో వనజ మామగారు అలాగే అత్తగారైన జానకమ్మ గారు ఎంతో సంతోషించి వనజను కోడలిలా కాక కూతురిలా చూసుకున్నారు..

పుట్టింటి ఆదరణకు నోచుకోని వనజ కూడా అత్తగారికీ, మామగారికీ సపర్యలు చేసుకుంటూ ఇంటి పనులన్నీ చక్కబెట్టుకుంటూ వాళ్ళందరితో బాగా కలిసిపోయి మసులుకునేది. ఇద్దరు బిడ్డల తల్లయింది. రెండు పురుళ్ళూ అత్తగారే పోసి తల్లిలా ఆదరించింది. కానీ అనుకోకుండా మామగారికి హార్ట్ ఎటాక్ వచ్చి అకాల మరణం చెందటమూ, ఆ తర్వాత ఏడాది తిరక్కుండానే భర్త మీద బెంగతో అత్తగారు కూడా పోవడంతో అన్ని కార్యక్రమాలూ బాధ్యతగా ముగించి ఆ ఇంటికి యజమానురాలయింది వనజ. అప్పట్నుంచి ఆడబిడ్డ లావణ్య మంచిచెడ్డలు చూడడం పండక్కి పిలిచి ఇంటిల్లిపాదికీ బట్టలు పెట్టి పంపించడమూ అలవాటయ్యింది. ఇదిగో ఇప్పుడు కొత్తగా నాటుకున్న విషబీజం ఆమె మనసులో కల్లోలం రేపింది.

ఆరోజు రాత్రి భోజనాలు అయ్యాక భర్తతో మాట్లాడుతూ మాటల సందర్భంలో ఈసారి సెలవులకి పిల్లల్ని తీసుకుని

ఎక్కడికైనా టూర్ కి వెళ్దామని అంది. ఎప్పుడూ శాంతవదనంతో ఉండే ఆనంద్ ముఖంలో కోపం చోటు చేసుకుంది. చెల్లాయి, బావగారు వస్తున్నామని నాకు ఫోన్ చేసి చెప్పారు. అయినా ఎన్నడూ లేనిది ఇలా కొత్తగా అడుగుతున్నావు.ఒకవేళ నిజంగానే టూర్ కి వెళ్ళటమంటూ జరిగితే ఈసారి సెలవులకి అదీ చెల్లీ పిల్లలు అందరితో కలిసే.. గుర్తుంచుకో అని సీరియస్ గా వార్నింగ్ ఇచ్చాడు ఆనంద్. చేసేదేం లేక మిన్నకుండిపోయింది వనజ.

లావణ్య బయలుదేరానని ఫోన్ చేయగానే బాత్రూం లో జారి పడ్డట్టు నటించి మంచమెక్కి దుప్పటి ముసుగేసింది వనజ. ఇంటిపని వంటపని చేయలేక వచ్చిన దారినే ఆడబిడ్డ వెళ్ళిపోతుందని వనజ అభిప్రాయం. కానీ దానికి విరుద్ధంగా లావణ్య వచ్చేరావడంతోనే వదిన అలా వుండడం చూసి కన్నీళ్ళ పర్యంతమయింది. గబగబా వంటచేసి అన్న పిల్లలకు, తన పిల్లలకు వండి వడ్డించింది. ఆ మరుసటి రోజునుంచే ఇల్లంతా బూజులు దులిపి, కడిగి దుప్పట్లన్నీ వాషింగ్ మెషీన్ లో వేసి పిల్లలకి ఇష్టమయిన పిండివంటలన్నీ చేయడమే కాకుండా వదినను మంచం దిగనీయకుండా అన్ని సపర్యలూ చేసి కన్నతల్లిలా ఆదరించింది. ఇంటెడు చాకిరీ చేసినా ఏ మాత్రం అలసటా, విసుగు ప్రదర్శించలేదు. అంతేకాకుండా పిల్లలందరికీ తన డబ్బులతోనే కొత్తబట్టలు కొనిచ్చింది. వారం రోజులు గడిచిపోయాయి.

ఇక రెండురోజుల్లోలావణ్య తిరుగు ప్రయాణం. రాత్రి పదిదాటుతున్నా నిద్రపట్టక మంచం మీద దొర్లుతున్న వనజకు తన రూం పక్కనే వున్న బాల్కనీలో భర్త ఆనంద్, లావణ్య మాట్లాడుకునే మాటలు వినిపించసాగాయ్. "అన్నయ్యా! మా అత్తగారింట్లోనిత్యం ఇంటి పనులతో అలసిపోయి నేను సెలవుల పేరు చెప్పి ఇలా ఈ కొద్ది రోజులు ఇక్కడికి వచ్చి అమ్మలాంటి వదిన చేతివంట తిని, మీ అందరితో కులాసాగా గడిపి విశ్రాంతి తీస్కున్నందువల్లవచ్చిన ఆనందంతో తిరిగి మిగతా రోజులన్నీ అలుపు తెలికుండా మా అత్తగారింట్లోగడపడానికి మీతో గడిపిన ఈ సంతోషం బూస్ట్ లాగా పని చేస్తుంది. కానీ ఇన్ని రోజులూ నేనొక విషయం విస్మరించాను. నేను ఎలా అయితే పుట్టినింటి హక్కునీ, ఆనందాన్నీ అనుభవిస్తున్నానో అలాగే వదిన కూడా విశ్రాంతి కోరుకుంటుంది కదా ! కానీ ' పుట్టినిల్లు' అనే వరం నోచుకోని వదినను చూస్తుంటే నాకు జాలి వేస్తుంది. ఇంతకాలం నేను ఆ విషయం గమనించలేదు. కానీ ఇలా వదిన మంచం మీద నుంచి లేవకుండా వుంటే నాకు చాలా బాధగా వుంది. అందుకే నేను వదిననూ, పిల్లల్నీ నాతోబాటు మా అత్తగారింటికి తీసుకెళ్తాను. తను విశ్రాంతి తీసుకుని మామూలు మనిషయ్యే వరకూ నెలరోజులపాటు మాతో వుంచుకుని పంపిస్తాను. మా అత్తగారు నా మాట కాదనరన్న నమ్మకం నాకుంది. " అంటున్న లావణ్య ఔన్నత్యం ముందర లేకిగా ఆలోచించి నాటకమాడి మంచమెక్కిన తన వ్యక్తిత్వానికి తనకే సిగ్గేసింది వనజకు. కానీ ఈ విషయం వెల్లడి చేసి తన మర్యాద పోగొట్టుకోకూడదని భావించి కలత నిద్రతో రాత్రంతా గడిపింది.

తెల్లవారుఝామునే లేచి ఇంటిపని ముగించి ఆడపడుచుకి , పిల్లలకు ఇష్టమైన వంటకాలన్నీ చేసింది. ఆశ్చర్యంగా చూస్తున్న లావణ్యతో పది రోజులుగా విశ్రాంతి తీసుకున్నందువల్ల తను కోలుకున్నానని చెప్పటమే కాకుండా ఎప్పట్లాగే పిల్లలతో, లావణ్యతో సరదాగా గడిపి, షాపింగ్ కి తీసుకెళ్ళి ప్రతీ ఏడాది పెట్టే బట్టలకంటే ఖరీదైన బట్టలు తనే అందరికీ కొని ఇంట్లో పండగ వాతావరణం నెలకొనేలా చేసింది.

తనతోపాటు రమ్మని మరీ మరీ చెప్పిన లావణ్యతో తప్పకుండా ఈసారి సెలవులకి వచ్చి ఆడపడుచు ఇల్లునే 'పుట్టినిల్లు' గా భావించి విశ్రాంతి తీసుకుంటానని చెప్పి దగ్గరుండి మరీ ఆడపడుచునీ, ఆమె భర్తనీ, పిల్లనీ రైలెక్కించి నిండైన మనసుతో ఇంటికి వచ్చింది వనజ.

కన్నవారు, తోడబుట్టినవారు వుంటేనే, 'పుట్టినిల్లు' కాదనీ, ప్రేమతో ఆదరించి ఆపద సమయంలో మేమంతా వున్నామని భరోసా ఇచ్చే గొప్ప మనసుగల మనుష్యులు వున్న ఏ ఇల్లయినా ప్రతీ ఆడపిల్లకు 'పుట్టినింటి' తో సమానమని గ్రహించిన వనజ ఇకపై ఎప్పుడూ పక్కింటివాళ్ళ మాటలూ, ఎదురింటి వాళ్ళ మాటలూ విని అయినవాళ్ళను బాధపెట్టకూడదని గట్టిగా నిర్ణయించుకుంది.

చెల్లినీ, పిల్లలనూ సెలవులకి ఇంటికి రానీయకుండా చేసిన భార్య ప్రయత్నం, ఆమె చేసిన నటన ఆ తర్వాత పశ్చాత్తాపంతో చెల్లాయి లావణ్య పట్ల భార్య ప్రవర్తన అన్నీ మౌనంగా గమనిస్తున్న ఆనంద్ మనసులోనే నవ్వుకున్నాడు. ఆడవారి సున్నితమైన మనస్తత్వానికి మనసులోనే జోహార్లర్పించాడు. వాళ్ళిద్దరూ ఇలాగే జీవితాంతం తోబుట్టువులుగా వుండాలని మనస్ఫూర్తిగా ఆశించాడు.

చదువుకున్న వారయినా, విజ్ఞతతో ఆలోచించి స్వంత విషయాలలోనూ, కుటుంబ విషయాలలోనూ సంబంధం లేని వ్యక్తుల మాటలు చెవికెక్కించుకోకుండా కుటుంబంలోని సభ్యులందరి మధ్యా బంధుత్వం తెగకుండా చిన్న చిన్న విషయాలలో సర్దుబాటు ధోరణి అలవర్చుకుంటే క్రొత్తగా పెళ్ళయ్యి, అత్తవారింటికి వెళ్ళిన ఏ ఆడపిల్లకయినా అత్తవారిల్లు కూడా 'పుట్టినిల్లు' గానే వుంటుందనడంలో ఎంతమాత్రమూ సందేహం లేదు.




పావనపురంలో ఉండే శంకరంకి ఇద్దరు కొడుకులు. వారి పేర్లు రాము, సోము. రాము ఎనిమిదవ తరగతి, సోము ఏడవతరగతి చదువుతున్నారు. రాము వినయ విధేయతలు కలిగి బుద్ధిగా చదువుకుంటాడు. సోముది పూర్తిగా విరుద్ధ స్వభావం. పెద్దల మాటని లెక్క చెయ్యడు. అయితే తన ఇద్దరు పిల్లలనీ మంచివాళ్ళుగా చూడాలని శంకరం కోరిక. అందుకే సోము ప్రవర్తనలో తేడా వచ్చినప్పుడల్లా గట్టిగా మందలించేవాడు.

ఒకసారి పిల్లలతో కలసి సరుకులు కొనడానికి అంగడికి వెళ్ళాడు శంకరం. తమకి తెలిసిన సుబ్బయ్యశెట్టి దుకాణంలో పొట్లాలు కట్టించి వాటిని సంచిలో వేసుకున్న తరువాత పిల్లలని రమ్మని పిలిచాడు. తండ్రిమాట విని పరుగున వచ్చాడు రాము. కాని విననట్టే ఉండిపోయాడు సోము.

అక్కడకి వచ్చిన రాముకి తండ్రి వెనుక వైపు నేల మీద అయిదు వందల రూపాయల నోటు కనిపించింది. దానిని తీసి

తండ్రి చేతిలో పెట్టి "ఇది కింద దొరికింది. మనదేమో చూడండి" అన్నాడు.

తన దగ్గరున్న డబ్బు సరిచూసుకున్న శంకరం "పాపం ఎవరిదో కింద పడినట్లుంది. మనది మాత్రం కాదు" అన్నాడు. అప్పుడు రాము "ఇది ఎవరిదో కనుక్కొని ఇచ్చేద్దాము" అన్నాడు.

అప్పుడే అక్కడకి వచ్చిన సోము ఆ మాటలు విన్నాడు. "అన్నయ్యకి దొరికిన డబ్బు కాబట్టి అది మనకే చెందుతుంది. ఎవరికీ ఇవ్వొద్దు. కావాల్సిన సరుకులు కొనుక్కొని వెళదాము. అమ్మ కూడా సంతోషిస్తుంది. మిగిలిన డబ్బులతో చాక్లెట్లు, ఐస్ క్రీములు మాకు కొనిపెట్టండి" అన్నాడు.

దానికి రాము ఒప్పుకోలేదు. "అలా చేయడం తప్పు. డబ్బు పోయినవాళ్ళని వెతికి పట్టుకుని తిరిగి ఇచ్చేద్దాము. మనది కాని దానికి ఆశ పడకూడదు. పరాయివాళ్ళ డబ్బు పాముతో సమానమని మాస్టారు చెప్పారు. పాము కనబడితే తప్పుకున్నట్టే డబ్బు కనబడినా తప్పుకోవాలి తప్ప సొంతం చేసుకోకూడదు" అన్నాడు.

దానికి సోము "అన్నయ్యకి ఏమీ తెలీదు. వాడి మాటలు వినొద్దు. మన డబ్బు పడిపోతే ఎవరూ తెచ్చి ఇవ్వరు కదా. మనం మాత్రం ఎందుకివ్వాలి?' అని అడిగాడు.

దానికి రాము "సోముకి కూడా నిజాయితీగా మెలగడం నేర్పాలి. అందుకోసం మనమొక పరీక్ష పెడదాము. ఆ నోటుని రహదారిలో పడేసి పక్కన దాక్కొని అది తీసిన వాళ్ళు తెచ్చిస్తారో ఇవ్వరో పరీక్షిద్దాము. అప్పుడు సోము చెప్పింది సబబో కాదో అర్ధమవుతుంది" అన్నాడు తండ్రితో.

అప్పటికి సుబ్బయ్యశెట్టి దుకాణంలో ఉన్న వాళ్ళలో ఎవ్వరు కూడా డబ్బు పోయిందని అడగకపోవడంతో శంకరం పిల్లలతో "సరే అలాగే చేద్దాము" అన్నాడు. సుబ్బయ్యశెట్టి దుకాణం నుండి బయటకు వచ్చి రహదారి మధ్య ఆ నోటుని పడేసి పక్కన కూర్చున్నారు

కొంతసేపటి తరువాత ఎవరో మనుషులు అటు వస్తున్న చప్పుడు వినిబడింది. ముగ్గురూ చెవులు రిక్కించి జాగ్రత్తగా విన్నారు. ఎవరో ఒక వ్యక్తి ఆ నోటుని తీసినట్లు కొంతవరకు కనిపించింది. అదెవరో తెలియలేదు. తరువాత జరిగేది తలచుకుంటూ ఆలోచనలో పడ్డారు ముగ్గురూ.

“దేవుడా! అది తీసినవాళ్లకి మంచి బుద్ధి పుట్టించి దానిని తిరిగిచ్చేలా చూడు. సోముకి నిజాయితీ మీద నమ్మకం కలుగుతుంది” అని లోలోపలే దేవుడిని మొక్కాడు రాము.

“మా అన్నయ్యకి లోకం తీరు తెలియాలంటే డబ్బు తీసినవాడు అక్కడ నుండి వెళ్లిపోవాలి. అదెలాగూ మాది కాదు కాబట్టి నాన్నకి నష్టం రాదు. కాని రాముకి నీతి, నిజాయితీల జబ్బు వదుల్తుంది.” అనుకున్నాడు సోము.

అలా వాళ్ళు అనుకుంటుండగా వాళ్ళని ఒక వ్యక్తి పిలిచాడు. ముగ్గురూ ఒకేసారి చూసారు. అక్కడ ఉన్నది తమ బడిలో పనిచేసే తెలుగు ఉపాధ్యాయుడు. వాళ్ళు ఆశ్చర్యపోయి ఆయనకి నమస్కారం పెట్టారు.

అప్పుడు మాస్టారు “ఈ అయిదు వందల నోటు మీదేనా” అని అడిగారు.

మాస్టారి మాటలు వినగానే రాము ముఖం సంతోషంతో వెలిగిపోగా సోము ముఖం చిన్నబోయింది. అప్పుడు శంకరం తెలుగు మాస్టారితో అంతవరకూ జరిగిన విషయం చెప్పాడు. “ మీరు నిజాయితీగా ఆ నోటు తెచ్చి రాముని గెలిపించారు. ఇప్పుడు సోముకి నిజాయితీ విలువ తెలుస్తుంది. బడిలోని పిల్లలకే కాకుండా రహదారిలో కూడా మంచి పాఠం బోధించారు. మీకు అభినందనలు” అన్నాడు ఆనందంగా.

దానికి మాస్టారు “ప్రదేశం ఏదైనా నా వృత్తిధర్మం నిర్వర్తించడంలో తేడాలుండవు. దారితప్పే విద్యార్థులని సరైన దారిలో పెట్టడానికి వచ్చే ఏ అవకాశమూ వదులుకోను” అని నవ్వుతూ చెప్పారు.

అప్పుడు శంకరం “ఈ డబ్బు దాని సొంతదారునికి అందిoచే పని మిగిలింది. ఇప్పుడేమంటావు సోమూ!”అని అడిగాడు.

సోము సిగ్గుపడుతూ “మనం సుబ్బయ్యశెట్టి దుకాణంకి వెళ్లి ఎవరైనా డబ్బు పోయినట్లు చెప్పారేమో కనుక్కుని ఇచ్చేద్దాము” అన్నాడు.వాళ్ళు వెళ్లేసరికి ఒక వ్యక్తి సుబ్బయ్యశెట్టితో తన డబ్బు పడిపోయిందని బాధపడుతూ చెప్పడం కనిపించింది.ఆ నోటు అతడిదో కాదో నిర్ధారించుకుని దానిని అప్పగించారు. అది జరిగిన తర్వాత సోము ప్రవర్తనలో మార్పు వచ్చింది. లోకంలో కొంతమంది చెడ్డవాళ్ళు ఉన్నంత మాత్రాన అందరినీ అనుమానించకూడదని బోధపడి నిజాయితీగా మెలగడం నేర్చుకున్నాడు. సోములో వచ్చిన మార్పుకి ఎంతో సంతోషించారు శంకరం కుటుంబ సభ్యులు. అయితే వారికెవరికీ తెలియని విషయం ఒకటుంది.

తమ ఇంటికి కావాల్సిన సరుకులు కొనడానికి సుబ్బయ్యశెట్టి దుకాణానికి వెళ్ళిన మాస్టారికి సోము మాటలు వినిపించాయి. పరాయివాళ్ళ డబ్బుకి ఆశ పడుతున్న సోము ప్రవర్తనకి బాధ పడ్డారు. బడిలో చెప్పిన మంచి విషయాలు గాలి కొదిలేసి అతడలా చెడ్డగా ఆలోచించడం నచ్చక వారిని రహస్యంగా వెంబడించి మిగతా కథ నడిపించారు. ఆ నోటుని మరొకరు తియ్యక ముందే తెచ్చి ఇచ్చారు. మొత్తం మీద సోములో నిజమైన పరివర్తన వచ్చింది. దానికి మాస్టారు కూడా సంతోషించారు.




www.gotelugu.com www.gotelugu.com www.gotelugu.com ww

" రా వదినా! రా! చాలాకాలమైంది నిన్ను చూసి " అని ఆహ్వానించింది ధనలక్ష్మి తన వదిన ధనలక్ష్మిని కూర్చీ చూపుతూ ఆప్యాయంగా.

" ఏమే ధనలక్ష్మీ! మీ ఆయన ఆఫీసుకు దారిమార్చి వెళుతున్నాడేమిటి ? మావీధివైపు రావటమే లేదు?" అంది కూర్చుంటూ వరలక్ష్మి.

" ఏంలేదు వదినా! ఆయన ఈమధ్య రోజూ రాశిఫలాలు టీ.వి.లో విని మరీ ఆఫీసుకువెళుతున్నాడు. వృషభరాశి వారు ఉత్తరం వైపునుంచి పోవాలనీ , అది మంచిదనీ అటువైపునుండి ఆఫీసుకు వెళుతున్నాడు." అంది ధనలక్ష్మి.

"అదేమిటే! మరీ చోద్యంగా ఉందీ! అలావెళితే ఆఫీసుకు దూర మవట్లేదుటే ! " అంది ఆశ్చర్యం ఒలకబోస్తూవరలక్ష్మి.

"ఏమచెప్పను వదినా! ఆయనకీ మధ్య చాదస్తం ఎక్కువై పోయింది . ఈరాశిఫలాల వారు 'మీకు ఈరోజు ప్రయాణం లాభదా యకం 'అన్న రోజుమాత్రమే క్యాంపు కెళుతున్నారు.!' ఆకుపచ్చరంగు ధరిస్తేమంచిది' అనగానే లేక పోయినా ఆకుపచ్చ షర్టు కొని మరీ వేసుకెళు తున్నారు. 'ఆంజనేయస్వామికి అప్పాలునైవేద్యం చేస్తే మంచి దంటే ' ఆరోజు నాచేత అప్పాలు చేయించి , అప్పాలు ఎక్కువ అన్నం తక్కువ గా తింటున్నారు. ఒకరోజు గణపతిపూజ, మరోక రోజు ఉమాపతి, ఇంకోరోజు రమా పతి, ఆరాశివారికి ఆరోజు ఏది మంచిదని చెప్తార్తో ఆ పూలు పండ్లతో పూజ చేస్తున్నారు.' ధన లాభం ' అని చెప్పిన నాడు ధనలక్ష్మిని, నన్నుకాదులే వదినా[ అంటూ సిగ్గుల మొగ్గై] వర్షం కురవ టానికి వరలక్ష్మినీ, నిన్నుకాదులే వదినా! ఆదేవతను పూజ చేస్తున్నాడు. పూజా మందిరంలో రోజు కొక ఫోటో మారుస్తున్నాడు . వినాయకునికి ఉండ్రాళ్ళు చేయాలి. సుబ్రహ్మణ్య స్వామికి సున్నుండలు, పరమశివునికి పాయసం, అనంతపద్మనాభునికి అరిసెలు, అన్నపూర్ణాదేవికి ఆవడ లు,! వేపుకు తినున్నాడనుకో!నిజానికి పూజకు ఒకదేవుడు చాలడా వదినా?చెప్పు. కొండంత దేవునికి కొండంత పత్రిపెట్ట గల మా!. దేవుళ్ళంతా ఒక్కటే కదా! " అంటూ తన బాధనంతా వెళ్ళబోసుకుంది , తన వదినతో ధనలక్ష్మి.

" అదేంటే మరీ విడ్డూరంగా ఉంది. ఇట్లాచేస్తూపోతే ఎంత డబ్బు ఖర్చవుతుందోకదా! " అంటూ సానుభూతి వ్యక్త పరిచింది వరలక్ష్మి.

" మొన్నమొన్న టీ.వి.లో ఎవరో ఒకామె " ఏమండీ బావున్నారా ! " అంటూ తన ప్రోగ్రాం లో మాటలు మొదలెట్టగానే తననే అనుకుని పొంగిపోయాడు.'ఆహా ! ఏమి ప్రేమ! ఎంత అభిమానం అంటూ' ఆమె చెప్పిన అడ్రెస్సుకు, ఒకరుద్రాక్ష ఆర్డరిచ్చాడు , అది మెడలో వేసు కుంటే ఉన్నత శిఖరాలను అందుకోవచ్చుట! చేతికి శనిదేవుని కంకణం , మెడ లో మేలిరత్నం తగిలించుకుని తిరుగుతున్నాడు. ఏమి టీ.వి లో కానీ ఇప్పుడు కాస్సేపు ప్రకటనలు అంటూ , సబ్బుల నుండి , సాంబారుపొడి వరకూ, చర్మ సౌందర్యానికి చల్లాయి సబ్బులూ, కోమల దేహానికి కొల్లాయి క్రీములూ, పులిపిరి కాయ లకు పుల్లాయి పౌడర్లూ... చస్తున్నా వినలేక, కనలేక. పూటకో సెంటూ గంటకో డ్రెస్సూ రోజు కో సబ్బూ మాఆయన మారుస్తున్నాడు. ఉన్నడబ్బంతా హూష్ కాకీ అవు తున్నది. 'అదేమిటండీ!' అంటే, నీకెందుకూ? ' లక్ష్మీ లాకెట్ పుచ్చుకో ధనలక్ష్మిని తెచ్చుకో!'నిన్నుకాదులే వదినా! , అంటూ నాకూ ఓలాకెట్ తెప్పించి ఇచ్చారు. ఇదమ్మా మా ఆయన భాగోతం! మీ తమ్ముడితో వేగలేక చస్తున్నానుకో! " అంటూ వాపోయింది పాపం ధనలక్ష్మి.

" అదా సంగతి! అందుకనా? ' రమణా రావు 'అనే పేరును మార్చి' రావురమణ ' అంటే కలిసి వస్తుందనేనా నేం ప్లేట్ మార్చింది? " అంటూ తన ఆశ్చర్యాన్ని వెలిబుచ్చింది వరలక్ష్మి నేం ప్లేట్ వైపు చూస్తూ.

ఇంతలో వరలక్ష్మి చేతిలో చరవాణి ' ఏమే రాకాసీ ఏమే నీవెక్కడున్నా చాటుకు పోవే చాటుకుపోవే!!' అనే కొత్తరింగ్టోన్ తో మోగసాగింది.ధనలక్ష్మిఆశ్చర్యంగా" అదేంటి వదినా ! ఈ కొత్తపాట ఎక్కడావినలేదే!"అంది బుగ్గలునొక్కుకుంటూనూ.

"అయ్యో! వదినా! ఎందుకు అడుగుతావ్లే! ఇప్పటిదాకా నీ బాధ చెప్పావ్ , నా అగచాట్లు చెప్తేతీరేవికాదు , అనుభవించి తీరా ల్సిందేనమ్మా! అందుకే నీకుచెప్పనే లేదు! మాఆయనకూ ఓ పిచ్చి పట్టుకుంది.నాతో నేరుగా మాట్లాడకూడదని , నాముఖం చూసి అస్సలు మాట్లాడకూడదనీ , నాకు ఆయుష్షీణమనీ, నన్ను పేరుతో పిలవరాదని ఏజ్యోతిష్కుడో చెప్పాట్ట, అందుకని ఇంట్లోఉన్నా పక్క గదిలోకి వెళ్ళి ఇలా చరవాణిలో మాట్లాడుతారు. అన్నం వడ్డించేప్పుడూ, ముఖానికి ముసు గేసుకో మంటాడు , టిఫిన్ టేబుల్ మీద పెట్టినెనొ పక్కకెలితే కాని వచ్చితినడు. తలవంచుకుని ఫోన్ లోనే వద్దనీ , కావాలనీ చెప్తారు. అందుకే ఏనాడూ లేంది నేను ఈ చరవాణిలో మాట్లాడను చెవులకు లోలాక్కులు తీసేసి చెవిలో వైర్లుపెట్టుకుని , మెడలో తాళిబొట్టుతోపాటుగా ఒక త్రాటికి ఈ ఫోన్ వ్రేలడదీసుకుని ఊరేగుతున్నాను , మా ఆయనకంటే మీఆయనే నయం , రోలొచ్చి మద్దేలకు మొరపెట్టుకున్నట్లుంది వదినా! మాఆయన ఒక్కమారు రింగిస్తే ఆఫీస్ నుంచి బయల్దేరుతున్నట్లు, రెండోమారు రింగిస్తేపదినిముషాల్లో ఇంటికి వస్తున్నట్లు, చూచనన్న మాట! నేరుగా నాముఖం చూడడు. రాత్రులు లైట్స్ ఆపేశాకే పడగ్గదిలో కెళ్ళాలి నేను. ముందుతాను వెళ్ళి అప్పుడు రింగిస్తాడు.నేను రింగ్ విని సమాధానమిస్తే లైట్లార్పుతాడు. ఆతర్వాతే నేను గదిలో కెల్ళాలన్న మాట! ఎవరైనా వింటే నవ్విపోరూ వదినా!నా యాతన ఎవరికి చెప్పుకోను! ఏ టెల్ వాడో టెక్ వాడో తన కంపెని రీచార్జ్ పెంచుకోను ఈమాటఏజ్యోతిష్కుడిచేతో చెప్పించి ఉంటే మాఆయనలాంటి చాదస్తులు నమ్మిఆచరిస్తుంటారల్లేఉంది వదినా! ఇహవస్తాను రెండో రింగ్ వేల్టికి వెళ్ళి తలుపుతీసి చాటుకెళితేనే ఇంట్లో అడుగుపెడతారు ! నాముఖం చూసి నెల్నాళ్ళైంది వదినా!"అంటూ ముక్కుచీదుకుంటూ గుమ్మందాటింది వరలక్ష్మి .